మీరే
చదువరి..
క్యూఆర్ కోడ్
స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త
వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే
విలేకరి..
క్యూఆర్ కోడ్
స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని
వార్తలు పంపండి..

గురువారం THURSDAY 30-7-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 2 Volume:2 | సంచిక: 31 Issue: 31

Circulated to Telangana
Published from Jagitial

30 జూలై 2026 - గురువారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - గ్రీష్మ ఋతువు ఆషాఢ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - తె. 5:58 సూర్యాస్తమయం - సా. 6:46 తిథి పాడ్యమి రా. 9:27 వరకు తరువాత విదియ సంస్కృత వారం బృహస్పతి వాసరః నక్షత్రం శ్రవణ సా. 5:32 వరకు తరువాత ధనిష్ఠ యోగం ఆయుష్మాన్ రా. 12:02 వరకు కరణం బాలవ ఉ. 8:49 వరకు కౌలవ రా. 9:27 వరకు వర్జ్యం రా. 10:00 నుండి రా. 11:43 వరకు దుర్ముహూర్తం ఉ. 10:14 నుండి ఉ. 11:05 వరకు మ. 3:21 నుండి సా. 4:12 వరకు రాహుకాలం మ. 1:58 నుండి మ. 3:34 వరకు యమగండం తె. 5:58 నుండి ఉ. 7:34 వరకు గుళికాకాలం ఉ. 9:10 నుండి ఉ. 10:46 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:22 నుండి తె. 5:10 వరకు అమృత ఘడియలు ఉ. 6:24 నుండి ఉ. 8:08 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:56 నుండి మ. 12:48 వరకు గమనిక: "౦" అనగా మరుసటి రోజున



## పీవోకేలో 40 మంది హత్య

### పాక్ బలగాల మారణకాండ

ముజఫరాబాద్: పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లో నిరసనలు తెలుపుతున్న పౌరులపై పాకిస్థాన్ బలగాలు జరిపిన దమనకాండలో గత రెండు రోజుల్లో కనీసం 40 మంది ప్రాణాలు కోల్పోయారు. డజన్ల కొద్దీ ప్రజలు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రాంతంలో తీవ్ర అశాంతి నెలకొన్న నేపథ్యంలో పాక్ సైన్యం విచక్షణారహితంగా వ్యవహరిస్తోందని స్థానిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. 'యునైటెడ్ తరువాయి 2 వ పేజీలో...



## ఉక్రెయిన్‌లో చిక్కుకున్న 13 మంది భారత నావికులు

### డ్రోన్, క్షిపణి దాడుల మధ్య ప్రాణభయంతో సిబ్బంది

### తక్షణం కాపాడాలంటూ సీఫేరర్స్ యూనియన్ విజ్ఞప్తి

కీవ్: ఉక్రెయిన్‌లోని చోర్నోమోర్స్క్ పోర్టులో ఒక కార్గో నౌకలో 13 మంది భారత నావికులు సహా మొత్తం 15 మంది సిబ్బంది చిక్కుకుపోయారు. రష్యా, ఉక్రెయిన్ మధ్య జరుగుతున్న పోరులో భాగంగా నల్ల సముద్రం సమీపంలో నిరంతరం తరువాయి 2 వ పేజీలో...



## కేంద్రానికి ఎల్ఐసీ రూ.12,207 కోట్ల డివిడెండ్

కేంద్ర ప్రభుత్వానికి ప్రభుత్వ రంగ సంస్థల నుంచి భారీగా డివిడెండ్లు అందుతున్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరానికి దేశంలోనే అతిపెద్ద బీమా సంస్థ ఎల్ఐసీ రూ.12,207 కోట్ల డివిడెండ్‌ను కేంద్రానికి అందించింది. అదే సమయంలో ప్రభుత్వ రంగ బ్యాంకులు, ప్రభుత్వ రంగ బీమా సంస్థల పనితీరు కూడా గణనీయంగా మెరుగుపడింది.

న్యూఢిల్లీ: మొండి బకాయిలు చారిత్రక కనిష్ఠానికి చేరగా, లాభాలు కొత్త రికార్డు నెలకొల్పాయి. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఎల్ఐసీ ఎండీ, సీఈఓ ఆర్. దొరైస్వామి రూ.12,207 కోట్ల డివిడెండ్ చెక్కును బుధవారం అందజేశారు. ఈ విషయాన్ని ఆర్థిక మంత్రి 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. అలాగే యూనియన్ -2 వ పేజీలో...

# మినిమం దోపిడీ

## పెనాల్టీలతో బ్యాంకులకు వేల కోట్లు

### 4 ఏళ్లలో 26,000 కోట్లకు పైగా వసూలు

### జరిమానాల వసూళ్లలో ప్రైవేట్ బ్యాంకుల జోరు

బ్యాంకు ఖాతాల్లో కనీస సగటు నిల్వ నిర్వహించలేదనే కారణంతో దేశంలోని బ్యాంకులు గత నాలుగు ఆర్థిక సంవత్సరాల్లో ఖాతాదారుల నుంచి రూ.26,170 కోట్లకు పైగా జరిమానాలు వసూలు చేశాయి. ఈ వివరాలను కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో వెల్లడించింది. రాజ్యసభలో కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లిఖితపూర్వక సమాధానంలో ఈ గణాంకాలను వెల్లడించారు. 2022-23 నుంచి 2025-26 మధ్య కాలంలో ఈ భారీ మొత్తం బ్యాంకుల ఖజానాలో చేరింది. ఇందులో ప్రభుత్వ రంగ బ్యాంకులతో పోలిస్తే ప్రైవేట్ బ్యాంకులే అత్యధికంగా జరిమానాలు వసూలు చేశాయి.



న్యూఢిల్లీ: గత ఆర్థిక సంవత్సరం 2025-26లోనే బ్యాంకులు రూ.7,086.63 కోట్లు మినిమమ్ బ్యాలెన్స్ చార్జీల రూపంలో వసూలు చేశాయి. ప్రైవేట్ బ్యాంకుల్లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ అత్యధికంగా రూ.1,798.14 కోట్లు వసూలు చేయగా, యాక్సిస్ బ్యాంక్ రూ.1,081.33 కోట్లు వసూలు చేసింది. ఈ రెండు బ్యాంకుల వాటానే ప్రైవేట్ బ్యాంకుల మొత్తం వసూళ్లలో దాదాపు తరువాయి 2 వ పేజీలో...

## 7,437 పోలీస్ ఉద్యోగాలకు నోటిఫికేషన్

### పోలీసు, ఫైర్, జైళ్ల శాఖల్లో భారీగా ఖాళీల భర్తీ

### ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ, తేదీలు త్వరలో ప్రకటన

### దరఖాస్తుకు ముందే వైద్య పరీక్షలు.. అభ్యర్థులకు సూచన

రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 7,437 పోస్టుల భర్తీకి తెలంగాణ రాష్ట్రస్థాయి పోలీస్ నియామక మండలి బుధవారం నాలుగు వేర్వేరు నోటిఫికేషన్లను జారీ చేసింది. పోలీస్, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్, ఫైర్ అండ్ డిజాస్టర్ రెస్పాన్స్, జైళ్లు, కరెక్షనల్ సర్వీసెస్ విభాగాల్లో ఈ నియామకాలు చేపట్టనున్నారు. ఈ మేరకు టీఎస్ఎల్‌పీఆర్‌బీ ఛైర్మన్ వి.వి. శ్రీనివాసరావు ఒక ప్రకటన విడుదల చేశారు.




హైదరాబాద్, జూలై 29 (ఈవార్తలు): తాజా నోటిఫికేషన్ల ప్రకారం, అత్యధికంగా పోలీసు శాఖలోనే పోస్టులను భర్తీ చేయనున్నారు. ఇందులో 3,697 సివిల్ కానిస్టేబుల్, 1,052 ఆర్మ్‌డ్ రిజర్వ్ కానిస్టేబుల్ పోస్టులు ఉన్నాయి. వీటితో పాటు 148 సివిల్ సబ్-ఇన్‌స్పెక్టర్లు, 14 రిజర్వ్ ఎస్సై, 12 రిజర్వ్ ఎస్సై, 3 రిజర్వ్ ఎస్సై, 23 అసిస్టెంట్ ఎస్సై, 24 పోలీస్ కానిస్టేబుల్, 20 పోలీస్ కానిస్టేబుల్ డ్రైవర్, 7 పోలీస్ కానిస్టేబుల్ మెకానిక్ పోస్టులను కూడా భర్తీ చేయనున్నారు. రెండో నోటిఫికేషన్ కింద స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ విభాగంలో 1,380 కానిస్టేబుల్, 44 ఎస్సై పోస్టులను భర్తీ చేయబోతున్నారు. ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్, ఎమర్జెన్సీ & సివిల్ డిఫెన్స్ విభాగంలో 751 ఫైర్ ఫైటర్లు, 39 స్టేషన్ ఫైర్ ఆఫీసర్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదలైంది. ఇక జైళ్లు, కరెక్షనల్ సర్వీసెస్ విభాగంలో 14 డిప్యూటీ జైలర్ (పురుషులు), ఒక డిప్యూటీ జైలర్ (మహిళ), 196 వార్డర్ (పురుషులు), 12 వార్డర్ (మహిళ) ఖాళీలను భర్తీ చేయనున్నట్లు ప్రకటించారు. ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణకు సంబంధించిన తేదీలను త్వరలోనే వెల్లడిస్తామని టీఎస్ఎల్‌పీఆర్‌బీ ఛైర్మన్ వి.వి. శ్రీనివాసరావు తరువాయి 2 వ పేజీలో...



## బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.14,351 |
| వెండి (కిలో): | రూ.2,35,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,891 |



# కాళేశ్వర గంగ ఉప్పొంగె!

### నంది పంప్‌హౌస్ ద్వారా గోదావరి జలాల ఎత్తిపోతలు.. మిడ్ మానేరులోకి జలాల తరలింపు

పెద్దపల్లి, జూలై 29 (ఈవార్తలు): కాళేశ్వరం ప్రాజెక్టు అనుబంధ లింక్ -2 పెద్దపల్లి జిల్లా ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి ధర్మారం మండలం నంది పంప్ హౌస్ ద్వారా గోదావరి జలాల ఎత్తిపోతలు ప్రారంభమైంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌లోకి భారీగా వరద నీరు చేరుతుండటంతో, కాళేశ్వరం ప్రాజెక్టు

# వానమ్మ వాగుల్లోకి చేరె!



### రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వానలు

### మరో రెండు రోజులు అతి భారీ వర్షాలు

### పలు జిల్లాలకు ప్రత్యేక హెచ్చరికలు జారీ

### పలు చోట్ల భారీ వరదలు.. ప్రజలకు అవస్థలు


(ఈవార్తలు న్యూస్ నెట్‌వర్క్-తెలంగాణ, ఏపీ)

వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ప్రభావంతో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. మరో 2 రోజుల పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. ఉత్తర, ఈశాన్య, పశ్చిమ తెలంగాణ జిల్లాలకు ప్రత్యేక హెచ్చరికలు జారీ చేస్తూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



మనం జీవిస్తున్న విశ్వం అత్యంత మేధావులైన నాగరికత రూపొందించిన ఒక భారీ కంప్యూటర్ సిమ్యులేషన్ కావచ్చనే సిద్ధాంతంపై ఎన్నో ఏళ్లుగా శాస్త్రవేత్తలు, తత్వవేత్తల మధ్య చర్చ జరుగుతోంది. అయితే తాజా గణిత అధ్యయనం ఈ సిద్ధాంతాన్ని సవాలు చేస్తూ, విశ్వంలోని కొన్ని మౌలిక అంశాలను ఏ కంప్యూటర్ అల్గారిథమ్ కూడా పూర్తిగా ప్రతిరూపించలేదని వాదిస్తోంది. ఒక కంప్యూటర్ సిమ్యులేషన్ విశ్వంలోని కొన్ని మౌలిక లక్షణాలను తప్పనిసరిగా కోల్పోతుందని, అందువల్ల నిజమైన విశ్వానికి సంపూర్ణ ప్రతిరూపాన్ని సృష్టించడం అసాధ్యమని ఈ అధ్యయనం పేర్కొంటున్నది.



## ఐఫోన్ లీజుకిస్తారు!

### అమెరికాలో యాపిల్ కొత్త లీజు పథకం

### ఐఫోన్, ఐప్యాడ్, మ్యాక్‌లకు నెలవారీ లీజు

న్యూయార్క్: అమెరికాలో యాపిల్ వినియోగదారులకు సంస్థ కొత్త సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇకపై ఐఫోన్, ఐప్యాడ్, మ్యాక్‌బుక్ వంటి పరికరాలను ఒకేసారి కొనుగోలు చేయాల్సిన అవసరం లేకుండా నెలవారీ లీజు పద్ధతిలో వినియోగించుకోవచ్చు. ఇటీవల మెమరీ చిప్‌ల ధరలు పెరగడం, కృత్రిమ మేధ (ఏఐ) టెక్నాలజీ తరువాయి 2 వ పేజీలో...




## 'వందేమాతరం'ను అవమానిస్తే నేరం

### బిల్లుకు రాజ్యసభ ఆమోదం

### ప్రతిపక్షాల ఆందోళన, వాకౌట్

జాతీయ గేయం 'వందేమాతరం'ను ఉద్దేశపూర్వకంగా అవమానించడాన్ని శిక్షార్హ నేరంగా ప్రకటించే 'జాతీయ గౌరవానికి అవమాన నిరోధక (సవరణ) బిల్లు-2026'కు రాజ్యసభ బుధవారం ఆమోదం తెలిపింది.

న్యూఢిల్లీ: ప్రస్తుతం జాతీయ జెండా, జాతీయ గీతానికి ఉన్న చట్టపరమైన రక్షణను ఇకపై వందేమాతరానికీ వర్తింపజేయనున్నారు. బిల్లుపై సుదీర్ఘ చర్చ అనంతరం ఎగువ సభ దీన్ని ఆమోదించింది. బిల్లుపై చర్చ సందర్భంగా సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభకు రావాలని ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేశారు. ఆప్, కాంగ్రెస్, సీపీఎం సభ్యులు అభ్యంతరాలు వ్యక్తం చేయగా, అనంతరం ప్రతిపక్ష సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. ఇరు పక్షాల తరువాయి 2 వ పేజీలో...

## పదునెక్కిన 'పరీక్షల' బిల్లు

### లోక్‌సభలో పరీక్షల సవరణ బిల్లుకు ఆమోదం

### అక్రమాలకు పాల్పడితే 10 ఏళ్ల జైలు, రూ.10 కోట్ల జరిమానా

### ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ఏర్పాటు.. మూడు నెలల్లోగా తీర్పునకు నిబంధన

పరీక్షల పేపర్ లీకేజీలు, అక్రమాలను నిరోధించేందుకు 'పబ్లిక్ పరీక్షల సవరణ బిల్లు-2026'కు లోక్‌సభ బుధవారం ఆమోదముద్ర వేసింది. రెండు రోజుల పాటు వాడివేడిగా సాగిన చర్చల అనంతరం వాయిస్ ఓటు ద్వారా ఈ కీలక బిల్లును సభ ఆమోదించింది. పరీక్షల వ్యవస్థలో పారదర్శకతను పెంచడం, విద్యార్థుల భవిష్యత్తును కాపాడటమే లక్ష్యంగా ఈ చట్టాన్ని తీసుకొచ్చినట్లు ప్రభుత్వం తెలిపింది.

న్యూఢిల్లీ: 2024 నాటి చట్టానికి సవరణలు చేస్తూ రూపొందించిన ఈ కొత్త బిల్లులో అత్యంత కఠినమైన నిబంధనలను చేర్చారు. దీని ప్రకారం పరీక్షల నిర్వహణలో అక్రమాలకు పాల్పడినట్లు రుజువైతే దోషులకు గరిష్ఠంగా 10 సంవత్సరాల వరకు జైలు శిక్ష, రూ.10 కోట్ల వరకు జరిమానా విధించే అవకాశం ఉంది. అంతేగాక దోషుల ఆస్తులను జప్తు చేసే అధికారాన్ని కూడా ఈ చట్టం కల్పిస్తుంది. ఈ తరహా కేసుల విచారణను వేగవంతం చేసేందుకు ప్రత్యేకంగా ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయనున్నారు. ఈ కోర్టులు మూడు తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు

30.7.2026

**మేషం:** చేపట్టిన పనులు సకాలంలో పూర్తిచేస్తారు. నూతన వస్తు,వస్త్రలాభాలు పొందుతారు. చిన్ననాటి మిత్రులతో కలుసుకుని విందు వినోదాది కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారాలు మరింత నిదానంగా సాగుతాయి. ఉద్యోగాలలో పని ఒత్తిడి నుండి ఉపశమనం పొందుతారు.

**వృషభం:** చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. సోదరులతో భూవివాదాలు కలుగుతాయి. బంధువర్గంతో అకారణంగా వివాదాలు కలుగుతాయి. దైవ సేవ కార్యక్రమాలపై దృష్టి సారిస్తారు. వ్యాపారమున కొన్ని నిర్ణయాలు నష్టాలు కలిగిస్తాయి. ఉద్యోగాలలో అదనపు పనిభారం తప్పదు.

**మిధునం:** కుటుంబ వ్యవహారాలలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు. సోదరులతో స్థిరాస్తి ఒప్పందాలు చేసుకుంటారు. దూరపు బంధువుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. భాగస్వామ్య వ్యాపారాలకు సకాలంలో పెట్టుబడులు అందుతాయి. ఉద్యోగ వాతావరణం ప్రశాంతంగా ఉంటుంది.

**కర్కాటకం:** సన్నిహితుల నుండి ఆర్థిక ఒత్తిడి పెరుగుతుంది. ఇంటా బయట గందరగోళ పరిస్థితులు ఉంటాయి. దూర ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. కుటుంబ సభ్యులతో వివాదాలు కలుగుతాయి. అనారోగ్య సమస్యలు చికాకు పరుస్తాయి. ఉద్యోగాలలో ప్రతికూల వాతావరణం ఉంటుంది. వృత్తి వ్యాపారాలు నిరుత్సాహపరుస్తాయి.

**సింహం:** ముఖ్యమైన వ్యవహారాలు నిదానంగా పూర్తిచేస్తారు. కుటుంబ సభ్యుల నుంచి ఆశించిన ధన సహాయం అందుతుంది. సోదరులతో కుటుంబ విషయాల గురించి చర్చిస్తారు. దూరపు బంధువుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. వ్యాపారాలు లాభలా బాటలో పయనిస్తాయి. ఉద్యోగమున అధికారులతో వివాదాలు రాజీ అవుతాయి.

**కన్య:** రావలసిన సొమ్ము సకాలంలో వసూలవుతుంది. ఆత్మీయులతో గృహమున సంతోషంగా గడుపుతారు. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో విశేషంగా పాల్గొంటారు. చేపట్టిన పనులు అనుకున్న సమయానికి పూర్తి చేస్తారు. వృత్తి స్వంత నిర్ణయాలు అమలు చేసి లాభాలు అందుకుంటారు. ఉద్యోగస్తుల పనితీరుకు అధికారుల నుండి ప్రశంసలు అందుతాయి.

**తుల:** పాత రుణాలు తీర్చడానికి నూతన ఋణప్రయత్నాలు చేస్తారు. బంధు మిత్రులతో స్వల్ప వివాదాలు కలుగుతాయి. కుటుంబ సభ్యులతో దైవదర్శనం చేసుకుంటారు. వ్యాపారాలలో తొందరపాటు నిర్ణయాలు మంచిది కాదు. నిరుద్యోగ యత్నాలు నిరుత్సాహపరుస్తాయి. ఉద్యోగస్తులకు కష్టానికి తగిన ఫలితం అందదు.

**వృశ్చికం:** చేపట్టిన పనులు శ్రమాదిక్యాతతో కానీ పూర్తి కావు కొన్ని విషయాలలో సోదరులతో వివాదాలు కలుగుతాయి. ఆర్థిక పరిస్థితి నిరాశ కలిగిస్తుంది. భూ సంబంధిత వివాదాలు కొంత ఒత్తిడి కలిగిస్తాయి. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చేయడం మంచిది కాదు. నూతన వ్యాపారాలు ప్రారంబానికి అవరోధాలు కలుగుతాయి. ఉద్యోగస్తులకు అధికారుల నుండి పని ఒత్తిడి పెరుగుతుంది.

**ధనస్సు:** సమాజంలో ప్రముఖులతో నూతన పరిచయాలు కలుగుతాయి. ఆధ్యాత్మిక సేవ కార్యక్రమాలలో పాల్గొంటారు. రావలసిన డబ్బు సకాలంలో చేతికి అందుతుంది. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. వ్యాపార, ఉద్యోగాలలో అంచనాలు అందుతాయి.

**మకరం:** సంతాన విద్యా విషయాలపై ద్రుష్టి సారిస్తారు. రాజకీయ వర్గాల ప్రముఖుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు. చేపట్టిన పనులలో శ్రమకు తగిన ఫలితం పొందుతారు. భూ సంభందిత క్రయ విక్రయాల లాభసాటిగా సాగుతాయి. వ్యాపారాలు విస్తరిస్తారు. ఉద్యోగాలలో ఉన్నత పదవులు పొందుతారు.

**కుంభం:** ముఖ్యమైన పనులు వాయిదా పడతాయి. ప్రయాణాలలో మార్గవరోదాలు కలుగుతాయి. వృధా ఖర్చులు పెరుగుతాయి. కుటుంబసభ్యులతో ఊహించని వివాదాలు కలుగుతాయి. శారీరక మానసిక అనారోగ్య సమస్యలు చికాకు పరుస్తాయి. వ్యాపారాలు మందగిస్తాయి. ఉద్యోగ వాతావరణం చికాకు కలిగిస్తుంది.

**మీనం:** కుటుంబ సభ్యుల ప్రవర్తన కొంత చికాకు కలిగిస్తుంది. చేపట్టిన పనులలో వ్యయప్రయాసలు అధికమౌతాయి. సన్నిహితులతో ఊహించని వివాదాలు కలుగుతాయి. నిరుద్యోగ ప్రయత్నాలు నిరాశ కలిగిస్తాయి. చిన్ననాటి మిత్రులతో దైవదర్శనాలు చేసుకుంటారు. వృత్తి ఉద్యోగములు సామాన్యంగా సాగుతాయి.

# 'మినిమం' దోపిడీ




**మొదటి పేజీ తరువాయి**

58 శాతం కావడం గమనార్హం. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) రూ.477.27 కోట్లతో అగ్రస్థానంలో నిలిచింది. అయితే, ఈ మొత్తం కరెంట్ అకౌంట్లకు మాత్రమే సంబంధించినదని ప్రభుత్వం స్పష్టం చేసింది. 2020 మార్చి నుంచే సేవింగ్స్ ఖాతాలపై మినిమమ్ బ్యాలెన్స్ పెనాల్టీలను ఎస్బీఐ పూర్తిగా రద్దు చేసింది. ఇటీవలి కాలంలో ప్రభుత్వ రంగ బ్యాంకులు ఖాతాదారులకు ఊరట కల్పించే చర్యలు చేపట్టాయి. మొత్తం 12 ప్రభుత్వ బ్యాంకుల్లో 10 బ్యాంకులు సేవింగ్స్ ఖాతాలపై మినిమమ్ బ్యాలెన్స్ పెనాల్టీలను పూర్తిగా రద్దు చేశాయి. అలాగే ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన ఖాతాలు, బేసిక్ సేవింగ్స్ బ్యాంక్ డిపాజిట్ అకౌంట్లు మినిమమ్ బ్యాలెన్స్ నిబంధనల నుంచి పూర్తిగా మినహాయింపు పొందాయి. దేశవ్యాప్తంగా ఉన్న సుమారు 73 కోట్ల ఇలాంటి ఖాతాలపై ఎలాంటి పెనాల్టీలు వర్తించవని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.

**బ్యాంకుల వసూళ్లు ఇలా..**

- ప్రభుత్వ రంగ బ్యాంకులు: రూ.2,137.92 కోట్లు
- ప్రైవేట్ బ్యాంకులు: రూ.4,948.71 కోట్లు
- (అంటే మొత్తం వసూళ్లలో దాదాపు 70 శాతం ప్రైవేట్ బ్యాంకుల నుంచే వచ్చింది.)
- ఐసీఐసీఐ బ్యాంక్ – రూ.353.50 కోట్లు
- కోటక్ మహీంద్రా బ్యాంక్ – రూ.290.65 కోట్లు
- యెస్ బ్యాంక్ – రూ.195.05 కోట్లు
- ఎస్బీఐ – రూ.477.27 కోట్లు
- బ్యాంక్ ఆఫ్ బరోడా – రూ.394.10 కోట్లు
- ఇండియన్ బ్యాంక్ – రూ.299.17 కోట్లు
- మినిమమ్ బ్యాలెన్స్ పెనాల్టీలు (2022–23 నుంచి 2025–26 వరకు)
- మొత్తం వసూళ్లు – రూ.26,170 కోట్లు
- 2025–26లో వసూలైన మొత్తం – రూ.7,086.63 కోట్లు
- ప్రభుత్వ బ్యాంకులు – 2,137.92 కోట్లు
- ప్రైవేట్ బ్యాంకులు – 4,948.71 కోట్లు

## ఐఫోన్ లీజుకిస్తారు!

**మొదటి పేజీ తరువాయి**

ప్రభావంతో పలు ఉత్పత్తుల ధరలను యాపిల్ 100 నుంచి 500 డాలర్ల వరకు పెంచిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. వినియోగదారులపై ఒకేసారి పడే ఆర్థిక భారం తగ్గించడమే ఈ కొత్త పథకం లక్ష్యంగా కనిపిస్తోంది. 'అప్‌గ్రేడ్' పేరుతో తీసుకొచ్చిన ఈ లీజు పథకాన్ని 'బై నౌ.. పే లేటర్' సేవలు అందించే క్లార్నాతో కలిసి యాపిల్ అమలు చేస్తోంది. వినియోగదారులు ఆన్‌లైన్‌లో లేదా యాపిల్ స్టోర్లలో దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే ఇందుకు సాఫ్ట్ క్రెడిట్ చెక్ తప్పనిసరి. ఐఫోన్‌లు, యాపిల్ వాచ్‌లను 12 లేదా 24 నెలల కాలానికి లీజుకు తీసుకోవచ్చు. మ్యాక్‌లు, ఐప్యాడ్‌లకు 24 లేదా 36 నెలల కాలపరిమితి ఉంటుంది. ఈ పథకంలో అత్యంత తక్కువ ధర ఐఫోన్‌కు నెలకు 17.99 డాలర్లు చెల్లిస్తే సరిపోతుంది. లీజు గడువు పూర్తయ్యాక వినియోగదారులకు పలు ఎంపికలు ఉంటాయి. మిగిలిన మొత్తాన్ని చెల్లించి అదే డివైజ్‌ను శాశ్వతంగా సొంతం చేసుకోవచ్చు. లేదా తిరిగి ఇచ్చేసి పథకం నుంచి వైదొలగవచ్చు. కొత్త మోడల్‌కు మారాలనుకుంటే మరో లీజు ఒప్పందం చేసుకునే అవకాశం కూడా ఉంటుంది. పరికరాన్ని కొనుగోలు చేసే సందర్భంలో మిగిలిన మొత్తాన్ని మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. అయితే మొత్తం ఖర్చు ఆ ఉత్పత్తి అసలు ధరను మించదని సంస్థ తెలిపింది. ఈ పథకంలో ఐఫోన్ 17 సిరీస్, ఐఫోన్ ఎయిర్, యాపిల్ వాచ్ సిరీస్ 11, యాపిల్ వాచ్ అల్ట్రా 3, మ్యాక్‌బుక్ ఎయిర్, మ్యాక్‌బుక్ ప్రో, ఐమ్యాక్, మ్యాక్ స్టూడియో, ఐప్యాడ్ ఎయిర్, ఐప్యాడ్ ప్రో, ఐప్యాడ్ మినీ వంటి ఉత్పత్తులు ఉన్నాయి. అయితే ఐఫోన్ 16, బేసిక్ ఐప్యాడ్, మ్యాక్‌బుక్ నియో, యాపిల్ వాచ్ ఎస్‌ఈ వంటి తక్కువ ధర మోడళ్లను ఇందులో చేర్చలేదు. ఇప్పటి వరకు అమలులో ఉన్న ఐఫోన్ అప్‌గ్రేడ్ ప్రోగ్రామ్‌కు బదులుగా ఈ కొత్త పథకాన్ని తీసుకొచ్చింది. సెప్టెంబర్‌లో కొత్త ఐఫోన్‌లతో పాటు యాపిల్ తొలి ఫోల్డబుల్ ఐఫోన్‌ను కూడా విడుదల చేసే అవకాశం ఉందన్న అంచనాల మధ్య ఈ నిర్ణయం ప్రాధాన్యం సంతరించుకుంది.

## 7,437 పోలీస్ ఉద్యోగాలకు నోటిఫికేషన్

**మొదటి పేజీ తరువాయి**

తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు నోటిఫికేషన్లలోని వివరాలను క్షుణ్ణంగా చదివి, అర్హతలను నిర్ధారించుకున్న తర్వాత అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు దరఖాస్తు చేసుకునే ముందే సివిల్ సర్జన్‌తో వైద్య పరీక్షలు చేయించుకుని, తాము నిర్దేశిత శారీరక, వైద్య ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నామో లేదో నిర్ధారించుకోవాలని పేర్కొన్నారు.

## కాళేశ్వర గంగ ఉప్పొంగె!

**మొదటి పేజీ తరువాయి**

ద్వారా గోదావరి జలాల ఎత్తిపోతలను అధికారులు ప్రారంభించారు. రాష్ట్ర నీటిపారుదల శాఖ అధికారుల ఆదేశానుసారం తాగునీటి అవసరాల కోసం రాజన్న సిరిసిల్ల జిల్లాలోని శ్రీ రాజరాజేశ్వర జలాశయం (మిడ్ మానేర్) నీటిని ఎత్తిపోయాలని ఆదేశాలు వచ్చాయి. దీంతో నంది పంప్ హౌస్‌లోని 1, 4, 5, 6 నెంబర్ల మోటార్లను బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు స్థానిక ఇంజనీరింగ్ అధికారులు ఆన్ చేశారు. దీంతో జలాలు పంప్ హౌస్ నుంచి 4 డెలివరీ సిస్టర్న్‌ల ఎగిసిపడి నంది రిజర్వాయర్ లోకి వెళ్తున్నాయి. ఒక్కో మోటార్ 3,150 క్యూసెక్కుల చొప్పున నీరు పంపింగ్ అవుతుంది. 4 మోటార్ల ద్వారా 12,600 క్యూసెక్కుల నీరు రిజర్వాయర్ లోని క్రష్ గేట్ల ద్వారా జంట సొరంగాల నుంచి కరీంనగర్ జిల్లా రామడుగు మండలంలోని లక్ష్మీపూర్ గాయత్రి పంప్ హౌస్ కు అదే పరిమాణంలో నీరు తరలుతోంది. గాయత్రి పంపు హౌస్ లో బాహుబలి మోటార్లను ఆన్ చేయడంతో జలాలు శ్రీ రాజరాజేశ్వర జలాశయానికి తరలుతున్నాయి. దశల వారీగా మరిన్ని మోటార్లను ప్రారంభించి, నీటి తరలింపును మూడు రోజులపాటు కొనసాగిస్తామని అధికారులు పేర్కొన్నారు.

## కేంద్రానికి ఎల్ఐసీ రూ.12,207 కోట్ల డివిడెండ్

**మొదటి పేజీ తరువాయి**

బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎండీ, సీఈఓ అశీష్ పాండే రూ.2,853 కోట్ల డివిడెండ్ చెక్కును అందించారు. న్యూ ఇండియా అష్యూరెన్స్ సీఎండీ గిరిజా సుబ్రహ్మణియన్ రూ.211 కోట్ల డివిడెండ్‌ను అందజేశారు. ప్రభుత్వ రంగ సంస్థల బలమైన ఆర్థిక పనితీరుకు ఇవి నిదర్శనమని ప్రభుత్వం పేర్కొంది. ఈ సందర్భంగా ప్రభుత్వ రంగ బ్యాంకుల ఆర్థిక స్థితిపై కూడా కేంద్రం వివరాలు వెల్లడించింది. 2025–26లో ప్రభుత్వ రంగ బ్యాంకుల స్థూల నిరర్థక ఆస్తుల (జీఎన్‌పీఏ) నిష్పత్తి 1.9 శాతానికి పడిపోయింది. ఇది ఇప్పటివరకు నమోదైన కనిష్ఠ స్థాయి. మరోవైపు ఈ బ్యాంకుల ఉమ్మడి నికర లాభం రూ.1.98 లక్షల కోట్లకు చేరింది. వరుసగా నాలుగో ఏడాది లాభాలను నమోదు చేయడం విశేషం. సంస్కరణలు, మెరుగైన పాలన, బలమైన మూలధన స్థితి ఈ ఫలితాలకు ప్రధాన కారణాలుగా ప్రభుత్వం పేర్కొంది. ఆర్థిక మంత్రిత్వ శాఖ వివరాల ప్రకారం 2025–26లో ప్రభుత్వ రంగ బ్యాంకుల నికర లాభం ఏడాది ప్రాతిపదికన 11.1 శాతం పెరిగింది. రుణాల వృద్ధి, వడ్డీ ఆదాయం పెరగడం, ఆస్తుల నాణ్యత మెరుగుపడటం లాభాలకు బలాన్నిచ్చాయి. 2026 మార్చి 31 నాటికి ఈ బ్యాంకుల మొత్తం వ్యాపారం రూ.283.3 లక్షల కోట్లకు చేరింది. గత ఏడాదితో పోలిస్తే ఇది 12.8 శాతం వృద్ధిని నమోదు చేసింది.



## పీవోకేలో 40 మంది హత్య

**మొదటి పేజీ తరువాయి**

కశ్మీర్ పీపుల్స్ నేషనల్ పార్టీ' (యూకేపీఎన్‌పీ) ఈ ఘటనలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నెల 27, 28 తేదీల్లో రావల్‌కోట్, మీర్పూర్ సహా పలు ప్రాంతాల్లో పాక్ బలగాలు జరిపిన దాడుల్లో 40 మంది పౌరులు మరణించారని, వందలాది మందిని అక్రమంగా అరెస్టు చేశారని ఆరోపించింది. అంతేకాకుండా జూన్ 5 నుంచి ఇప్పటివరకు 100 మందికి పైగా పౌరులను పాక్ సైన్యం చంపేసిందని, వందల మందిని బలవంతంగా అదృశ్యం చేసిందని పేర్కొంది. ఇదిలా ఉండగా, జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ (జేఏఏసీ) నేత సర్దార్ అమ్మాన్ ఖాన్ కూడా పాక్ సైన్యంపై విరుచుకుపడ్డారు. ఇది నిరాయుధులైన పౌరులపై జరిగిన 'మారణకాండ' అని ఆయన అభివర్ణించారు. "కేవలం రెండు రోజుల్లోనే పాక్ బలగాలు 38 మంది శాంతియుత నిరసనకారులను అత్యంత కిరాతకంగా చంపేశాయి" అని ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. పీఓకేలో కొనసాగుతున్న ఈ నిరసనలు, ఇస్లామాబాద్ నియంత్రణకు ప్రత్యక్ష సవాలుగా మారాయి. ఈ ఘటనలపై ఐక్యరాజ్యసమితి, యూరోపియన్ యూనియన్ తక్షణమే స్పందించి, స్వతంత్ర దర్యాప్తునకు ఆదేశించాలని, పౌరులను రక్షించాలని యూకేపీఎన్‌పీ డిమాండ్ చేసింది. ప్రస్తుతం పీఓకేలోని చాలా ప్రాంతాల్లో కమ్యూనికేషన్ వ్యవస్థలను పూర్తిగా నిలిపివేసి, కర్ఫ్యూ వాతావరణం విధించారు.

## పదునెక్కిన 'పరీక్షల' బిల్లు

**మొదటి పేజీ తరువాయి**

నెలల వ్యవధిలోనే విచారణ పూర్తి చేసి తీర్పు వెలువరించాల్సి ఉంటుంది. ఇటీవల నీట్ పేపర్ లీక్ వ్యవహారం దేశవ్యాప్తంగా పెను దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే పేపర్ లీక్‌లకు వ్యతిరేకంగా కఠినమైన చట్టం తీసుకువస్తామని ప్రధాని నరేంద్ర మోదీ హామీ ఇచ్చారు. ఆ తర్వాత కేంద్ర క్యాబినెట్ ఆమోదించిన ఈ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టారు. ం

## 'వందేమాతరం'ను అవమానిస్తే నేరం

**మొదటి పేజీ తరువాయి**

సభ్యులు తమ అభిప్రాయాలు వెల్లడించిన తర్వాత కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా నిత్యానంద్ రాయ్ మాట్లాడుతూ, 1971లో జాతీయ చిహ్నాల పరిరక్షణ కోసం ఈ చట్టాన్ని తీసుకొచ్చారని గుర్తు చేశారు. ఇప్పుడు అదే రక్షణను వందేమాతరానికీ విస్తరిస్తున్నామని చెప్పారు. బంకించంద్ర చటర్జీ 1875లో ఈ గీతాన్ని రచించారని, 1896 కాంగ్రెస్ సమావేశంలో రవీంద్రనాథ్ ఠాగూర్ ఆలపించారని వివరించారు. స్వాతంత్ర్య సమరయోధులు చివరి క్షణాల్లో కూడా 'వందేమాతరం' నినాదం చేశారని గుర్తుచేశారు. ఈ బిల్లును వ్యతిరేకించడం జాతీయ నాయకుల భావాలకు విరుద్ధమని వ్యాఖ్యానించారు. దేశ ఐక్యత, జాతీయ భావనను బలోపేతం చేయడమే ఈ చట్టం ఉద్దేశమని చెప్పా రు. దర్యాప్తు, చర్చల అనంతరం ప్రతిపక్షం వాకౌట్ చేసిన నేపథ్యంలో రాజ్యసభ బి ల్లును ఆమోదించింది. రాష్ట్రపతి ఆమోదం తర్వాత బిల్లు చట్టంగా రూపం దాల్చనుంది.

## ఉక్రెయిన్‌లో చిక్కుకున్న 13 మంది భారత నావికులు

**మొదటి పేజీ తరువాయి**

డ్రోన్, క్షిపణి దాడులు జరుగుతుండటంతో వారు తీవ్ర ప్రాణభయంతో ఉన్నారని 'ఫార్వార్డ్ సీమెన్స్ యూనియన్ ఆఫ్ ఇండియా' (ఎఫ్ఎస్‌యూఐ) ఆందోళన వ్యక్తం చేసింది. 'ఎం.వీ. అమీర్1' అనే నౌక భయంకరమైన, ప్రాణాంతక పరిస్థితుల్లో చిక్కుకుందని ఎఫ్ఎస్‌యూఐ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో పోస్ట్ చేసింది. "నౌక సమీపంలో పదేపదే డ్రోన్, క్షిపణి దాడులు జరుగుతున్నాయి. ఏ క్షణంలోనైనా నౌకపై నేరుగా దాడి జరగవచ్చనే భయంతో సిబ్బంది బతుకుతున్నారు" అని యూనియన్ పేర్కొంది. సిబ్బందిని తక్షణమే కాపాడి, వారిని స్వదేశానికి తరలించే ఏర్పాట్లు చేయాలని భారత ప్రభుత్వం, నౌక యాజమాన్యం, ఇతర అధికారులను కోరింది. "సంఘర్షణ ప్రాంతాల్లో భారత నావికులను ఇలా లక్ష్యాలుగా వదిలేయవద్దు. వెంటనే చర్యలు తీసుకోండి" అని విజ్ఞప్తి చేసింది. నౌక పరిసరాల్లో దట్టమైన పొగ కమ్ముకుంటున్న దృశ్యాలతో కూడిన ఒక వీడియోను కూడా పంచుకుంది. ఇటీవలి కాలంలో నల్ల సముద్రంలో వాణిజ్య నౌకలపై ఇలాంటి దాడులు పెరిగాయి. గత వారం జరిగిన దాడిలో ఒక భారత నావికుడు మరణించిన ఘటనపై భారత్ సోమవారం తీవ్రంగా స్పందించింది. ఉక్రెయిన్ రాయబారి ఒలెక్సాండర్ పొలిష్‌చుక్‌ను పిలిపించి, వాణిజ్య నౌకలపై దాడులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు గట్టిగా నిరసన తెలియజేసింది. ఎంవీ ఒమోర్ఫీ అనే నౌకపై ఉక్రెయిన్ డ్రోన్ దాడులు చేసినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. తాజాగా 13 మంది నావికులు చిక్కుకున్న ఘటనపై భారత విదేశాంగ శాఖ గానీ, సంబంధిత షిప్పింగ్ కంపెనీ గానీ ఇప్పటివరకు స్పందించలేదు.

# వానమ్మ వాగుల్లోకి చేరె!

**మొదటి పేజీ తరువాయి**

సూచించింది. ఈ క్రమంలోనే హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. అదే సమయంలో ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, హైదరాబాద్, జనగాం, కామారెడ్డి, ఖమ్మం, కుమురం భీం, మేడ్చల్, మహబూబాబాద్, మంచిర్యాల, మెదక్, ములుగు, సంగారెడ్డి, సిద్దిపేట, సూర్యాపేట, వరంగల్, యాదాద్రి భువనగిరి జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. భారీ వర్షాలతో రాష్ట్రంలోని వాగులు, వంకలు, నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. పలు చోట్ల లోలెవల్ వంతెనలు నీట మునగడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మెదక్ జిల్లాలో హవేలీఘనపూర్ మండలం దూప్‌సింగ్ తండా వాగు ఉప్పొంగడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ప్రసిద్ధ ఏడుపాయల వనదుర్గ భవాని ఆలయం సమీపంలోని ఆనకట్ట అలుగు పారుతుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో వరి నాట్లు కూడా జోరందుకున్నాయి. జగిత్యాల జిల్లాలో భారీ వర్షాలతో ధర్మపురి మండలంలోని అనంతారం, నేరెళ్ల వాగులు జాతీయ రహదారిపై నుంచి ప్రవహిస్తున్నాయి. దీంతో జగిత్యాల–ధర్మపురి మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఆక్సాయిపల్లె–నాగారం రహదారికి గండి పడగా, పలు గ్రామాల్లో ఇళ్లలోకి వరద నీరు చేరింది. గత 24 గంటల్లో జగిత్యాలలో 18.9 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో రాష్ట్రంలోని ప్రధాన ప్రాజెక్టుల్లోకి వరదనీరు భారీగా చేరుతోంది. ఎగువన కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో నిజాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ప్రస్తుతం 6,585 క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తోంది. నిజాంసాగర్ ప్రాజెక్టు మొత్తం నీటిమట్టం 1,395.40 అడుగులు కాగా.. నిల్వ 7.139 టీఎంసీలుగా నమోదైంది. అటు జూరాల ప్రాజెక్ట్‌లోకి 27 వేల క్యూసెక్కుల వరద ప్రవాహం కొనసాగుతోంది. ప్రస్తుత నీటిమట్టం 317.240 మీటర్లు కాగా.. నీటి నిల్వ 7.17 టీఎంసీలుగా ఉంది. వరద నీటి నేపథ్యంలో ఎగువ, దిగువ జలవిద్యుత్ కేంద్రాల్లో మొత్తం 395 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది. మరోవైపు.. హైదరాబాద్ నగరంలో ఆకాశం మేఘావృతమై ఉండటంతో పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. లోతట్టు ప్రాంతాల్లో నీటి నిల్వలు ఏర్పడే అవకాశం ఉండటంతో ప్రజలు అవసరమైతే తప్ప బయటకు రావద్దని అధికారులు సూచిస్తున్నారు. నగరంలో వర్షాలు, ట్రాఫిక్ నేపథ్యంలో ఐటీ కంపెనీలు తమ ఉద్యోగులను నిర్ణీత సమయం కంటే ముందు ఇళ్లకు పంపించేలా లాగౌట్ ఏర్పాట్లు చేయాలని హైదరాబాద్ పోలీసులు కీలక ఆదేశాలు జారీ చేశారు. భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వరద ప్రవాహం ఉన్న వాగులు, వంకలు దాటేందుకు ప్రయత్నించవద్దని అధికారులు హెచ్చరించారు.

సింగరేణి బొగ్గు ఉత్పత్తికి అంతరాయం

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉదయం నుంచి మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో సింగరేణి బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. భూపాలపల్లి సింగరేణిలోని కాకతీయ ఖని–2, 3 ఉపరితల గనుల్లో పనులు నిలిచిపోయాయి. కోల్ బెంచ్‌లోకి వరద నీరు చేరడంతో బ్లాస్టింగ్ చేసే అవకాశం లేకుండా పోయింది. దీంతో బొగ్గు ఉత్పత్తికి సంబం ధించిన పనులను ఆపివేశారు.

జగిత్యాల–ధర్మపురి మధ్య నిలిచిన రాకపోకలు

ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలోని భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల్లో వర్షాలు కురిశాయి. జగిత్యాల జిల్లా ధర్మపురి,



## గురు పౌర్ణమి సందర్భంగా అన్నదాన సేవ

వేములవాడ అర్బన్, జూలై 29 (ఈవార్తలు): గురు పౌర్ణమి సందర్భంగా సాయిరూప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో భక్తులు, నిరుపేదలకు అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దాతల సహకారంతో చేపట్టిన ఈ సేవా కార్యక్రమంలో ఆసుపత్రిలోని రోగులు, వారి సహాయకులు, పేదలకు భోజనం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపకులు ఏద్దండి రాజు, ట్రస్ట్ నిర్వాహకులు పిల్లి బాబురావు మాట్లాడుతూ, ప్రతి ఏడాది గురు పౌర్ణమి సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం తమ సంప్రదాయంగా కొనసాగుతోందన్నారు. “మానవ సేవే మాధవ సేవ” అనే భావనతో ఆకలితో ఉన్న ప్రతి ఒక్కరికీ ఆహారం అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. సమాజ సేవను తమ సామాజిక బాధ్యతగా భావిస్తూ భవిష్యత్తులోనూ మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షులు ఏద్దండి రాజు--సరళ, కోశాధికారి దూలం భూమేష్ గౌడ్, సభ్యులు అఖిలేష్ రెడ్డి, మహేందర్, మల్కాపురం ప్రశాంత్ గౌడ్, మోత్కుపల్లి శ్రీనివాస్ యాదవ్, శివరాత్రి వెంకటేష్, వేముల సతీష్, నందగిరి సత్యం గౌడ్, వాసాల హరిప్రసాద్, గోంటి నవీన్, పబ్బ సురేష్, అడిగొప్పుల విద్యాశ్రీ, ఇట్టే పూజ తదితరులు పాల్గొన్నారు.



## గురు పౌర్ణమి సందర్భంగా మాధవరం ప్రత్యేక పూజలు

కూకట్‌పల్లి, జూలై 29 (ఈవార్తలు): గురు పౌర్ణమి సందర్భంగా బాలానగర్ సాయినగర్‌లోని శ్రీ సాయిబాబా దేవాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, బాలానగర్ మాజీ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి పాల్గొని సాయిబాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ, హిందూ సంప్రదాయంలో గురు పౌర్ణమికి విశిష్ట స్థానం ఉందన్నారు. వేదాలను విభజించి మానవాళికి అందించిన వేదవ్యాస మహర్షి జయంతిగా ఈ పర్వదినాన్ని జరుపుకుంటారని తెలిపారు. అలాగే ఆదియోగి శివుడు సప్తర్షులకు యోగ విద్యను బోధించిన రోజుగా కూడా గురు పౌర్ణమిని భావిస్తారని పేర్కొన్నారు. అజ్ఞానమనే చీకటిని తొలగించి జ్ఞానమనే వెలుగును ప్రసాదించే గురువులను ఈ పవిత్ర దినాన ప్రతి ఒక్కరూ గౌరవించి వారి ఆశీస్సులు పొందాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ అంబటి సునీల్ కుమార్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మాజీ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డిలను శాలువాలతో సత్కరించి తీర్థప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ సాయిబాబా దేవాలయ కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు దేవులపల్లి కృష్ణమూర్తి, దారం సతీష్ గుప్తా, ఎడ్ల ప్రభాకర్, సుజాత గౌడ్, మహంకాళి సూరి, సిద్ధిరాములు గుప్తా, రాజేష్ గౌడ్, రిషి యాదవ్, జి. సందీప్ గౌడ్‌తో పాటు స్థానికులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## గురువు దైవ స్వరూపం: బండి రమేష్

కూకట్‌పల్లి, జూలై 29 (ఈవార్తలు): గురు పౌర్ణమి సందర్భంగా టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ భరత్‌నగర్, కేపీహెచ్‌బీ, బాలాజీనగర్ ప్రాంతాల్లోని సాయిబాబా, దత్తాత్రేయ స్వామి దేవాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గురువు సాక్షాత్తు దైవ స్వరూపమని, గురువు ఆశీస్సులు ఉంటే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించడం సులభమవుతుందని అన్నారు. భారతీయ సంస్కృతిలో గురువుకు అత్యున్నత స్థానం ఉందని, గురువు చూపిన మార్గంలో నడిచే వారికి జ్ఞానం, సంస్కారం, విజయం లభిస్తాయని పేర్కొన్నారు. సమాజ నిర్మాణంలో గురువుల పాత్ర అమూల్యమని, ప్రతి ఒక్కరూ తమ జీవితానికి మార్గదర్శకులైన గురువులను గౌరవించి వారి ఆశీస్సులు పొందాలని పిలుపునిచ్చారు. గురు పౌర్ణమి సందర్భంగా రాష్ట్ర ప్రజలకు, కూకట్‌పల్లి నియోజకవర్గ ప్రజలకు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులందరికీ బండి రమేష్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగిరెడ్డి, తూము వేణు, పుష్ప రెడ్డి, గాలి బాలాజీ, సాధు ప్రతాప్ రెడ్డి, రంగమోహన్, తూము సంతోష్, దినేష్, కొండల్, శంకర్, అశోక్, రాజేష్, ప్రకాష్, రాజా, గోపాల్ చౌదరి, ఆదినారాయణ, సంధ్య, సుజాత, వాణి తదితరులు పాల్గొన్నారు.

# పరిచయం.. ప్రేమ.. మనస్పర్థలు

### ఉదయ్ కృష్ణారెడ్డి కేసులో కీలకాంశాలు.. కేసు వివరాలు వెల్లడించిన హైదరాబాద్ సీపీ సజ్జనార్



హైదరాబాద్, జూలై 29 (ఈవార్తలు): దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన లైంగిక వేధింపుల కేసులో శిక్షణలో ఉన్న ఐపీఎస్ అధికారి ఎం. ఉదయ్ కృష్ణారెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు. సహచర మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిణి చేసిన ఫిర్యాదు మేరకు అరెస్టయిన అతడిని ఉప్పరపల్లి కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది. దీంతో నిందితుడిని చంచల్‌గూడ సెంట్రల్ జైలుకు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. శివరాంపల్లిలోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీ(ఎస్‌వీపీఎన్‌పీఏ)లో శిక్షణ పొందుతున్న కర్ణాటకకు చెందిన 30 ఏళ్ల మహిళా అధికారిణి జూలై 18న అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఉదయ్ కృష్ణారెడ్డి తనపై పలుమార్లు లైంగిక వేధింపులకు పాల్పడటమే కాకుండా, అసభ్యకర సందేశాలు పంపాడని, కత్తితో బెదిరించి, గొంతు నులిమి హత్య చేసేందుకు ప్రయత్నించాడని ఆమె ఆరోపించారు. తన ప్రైవేట్ వీడియోలను చిత్రీకరించి భర్తకు పంపాడని కూడా ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కేసు దర్యాప్తును హైదరాబాద్ ఉమెన్స్ సేఫ్టీ వింగ్ డీసీపీ లావణ్య నాయక్ నేతృత్వంలోని ప్రత్యేక బృందానికి అప్పగించారు. బాధితురాలికి నిర్వహించిన వైద్య పరీక్షల్లో ఆమె మెడ, బుగ్గలపై గాయాలున్నట్లు నిర్ధారణ అయింది. నిందితుడు ఉదయ్ కృష్ణారెడ్డి గతంలో పోలీస్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించినట్లు సజ్జనార్ వెల్లడించారు. యూపీఎస్సీలో 350వ ర్యాంకు సాధించి ఐపీఎస్‌కు ఎంపికైన అతను, 2025 డిసెంబర్ నుంచి శిక్షణ పొందుతున్నాడని తెలిపారు. అదే ఏడాది మధ్యలో ఇన్‌స్టాగ్రామ్ ద్వారా బాధితురాలితో నిందితుడికి పరిచయం ఏర్పడినట్లు వివరించారు. కానిస్టేబుల్ నుంచి ఐపీఎస్ కు ఎంపికైన తన విజయప్రస్థానంపై ఉదయ్ కృష్ణారెడ్డి పెట్టిన పోస్టుకు బాధితురాలు స్పందించడంతో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో, తాను 2024 బ్యాచ్ ఐపీఎస్‌కు ఎంపికయ్యానని, ఎక్స్‌ట్రా ఆర్డినరీ లీవ్‌లో ఉన్నందున 2025 బ్యాచ్‌తో కలిసి శిక్షణ తీసుకోనున్నట్లు బాధితురాలు నిందితుడికి తెలియజేసినట్లు వెల్లడించారు. ఆ పరిచయం కాస్తా స్నేహంగా మారి, తదనంతరం ప్రేమకు దారితీసిందని సజ్జనార్ పేర్కొన్నారు. శిక్షణ సమయంలో వీరి మధ్య బంధం బలపడినప్పటికీ, కొంతకాలానికి ఇద్దరి మధ్య మనస్పర్థలు తలెత్తాయని తెలిపారు. నిందితుడు పలుమార్లు ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించడమే కాకుండా, బాధితురాలి ల్యాప్‌టాప్‌ను విసిరికొట్టి ధ్వంసం చేసినట్లు వెల్లడించారు. బాధితురాలు తనను బ్లాక్ చేయడంతో, నిందితుడు నకిలీ సోషల్ మీడియా ఖాతాలను సృష్టించి వ్యక్తిగత చాట్ వివరాలను బహిర్గతం చేస్తానని బెదిరింపులకు పాల్పడ్డాడని సజ్జనార్ తెలిపారు. వేధింపులు భరించలేక బాధితురాలు అతడికి దూరంగా జరిగి మరొకరిని వివాహం చేసుకున్నప్పటికీ, నిందితుడి వేధింపులు కొనసాగడంతో చివరకు ఆమె పోలీసులను ఆశ్రయించారని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

#### ఉదయ్ కృష్ణారెడ్డికి 14 రోజుల రిమాండ్

ట్రైనీ ఐపీఎస్ ఎం. ఉదయ్ కృష్ణారెడ్డికి న్యాయస్థానం 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది. మంగళవారం అరెస్టయిన ఆయన్ను పోలీసులు బుధవారం ఉప్పర్‌పల్లి కోర్టులో హాజరుపరిచారు. విచారణ జరిపిన న్యాయమూర్తి, ఆగస్టు 11 వరకు రిమాండ్ విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఉదయ్‌ను చంచల్‌గూడ సెంట్రల్ జైలుకు తరలించారు.

# కాంగ్రెస్ వల్లే పెద్దికి గుండెపోటు

### ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపణలు

హైదరాబాద్, జూలై 29 (ఈవార్తలు): బీఆర్ఎస్ సీనియర్ నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితి విషమంగా కొనసాగుతున్న వేళ ఆయనకు గుండెపోటు రావడానికి దారితీసిన పరిస్థితులపై బీఆర్ఎస్ అధికార ప్రతినిధి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సంచలన ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ వేధింపులే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్యం క్షీణించడానికి కారణమని ఆయన ఆరోపించారు. ముఖ్యంగా సీఎం రేవంత్ రెడ్డి సన్నిహితుడి ప్రమేయంతో ఆయనపై తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చారని చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు తీవ్ర దుమారానికి కారణం అయ్యాయి. నర్సంపేటలో కొంతమంది వ్యాపారులు భూములు విక్రయించిన వ్యవహారంలో సీఎం సన్నిహితుడు ఆసక్తి చూపారని, అనంతరం ఆ భూముల వ్యవహారంపై ఈఓడబ్ల్యూలో కేసులు నమోదు చేసి, సుదర్శన్ రెడ్డికి సన్నిహితులైన వ్యాపారులను విచారణ పేరుతో తీవ్రంగా వేధించారని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. ఈ కేసులో పెద్ది సుదర్శన్ రెడ్డి పేరును చేర్చాలని ఒత్తిడి తీసుకొచ్చారని.. ఆయన పలువురు అధికారులను సంప్రదించినా ఎలాంటి ఉపశమనం లభించలేదని చెప్పారు. గురుకుల బంకర్ బెడ్ల కొనుగోలు వ్యవహారం, సివిల్ సప్లైస్‌లో జరిగినట్లు ఆరోపిస్తున్న అవకతవకలపై పెద్ది సుదర్శన్ రెడ్డి ఆధారాలతో ప్రభుత్వాన్ని ప్రశ్నించారని.. ఈ నేపథ్యంలోనే రూ. 1,100 కోట్ల సివిల్ సప్లైస్ స్కాం, స్కూల్ ఎడ్యుకేషన్ శాఖలో బంకర్ బెడ్ల కొనుగోలు వ్యవహారంపై ఉన్నతాధికారులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, హైకోర్టు, సుప్రీంకోర్టును కూడా ఆశ్రయించారని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ అంశాలే పెద్ది సుదర్శన్ రెడ్డిని టార్గెట్ చేయడానికి కారణం అయ్యాయని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపణలు గుప్పించారు. కాంగ్రెస్ పార్టీ పాలన ఎంత క్రూరంగా ఉందో పెద్ది సుదర్శన్ రెడ్డి ఉదంతమే నిదర్శనమని విమర్శలు చేశారు. మరోవైపు.. గుండెపోటుతో తీవ్ర అస్వస్థతకు గురైన పెద్ది సుదర్శన్ రెడ్డి ప్రస్తుతం హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో అడ్వాన్స్‌డ్ క్రిటికల్ కేర్ యూనిట్‌లో చికిత్స పొందుతున్నారు. ఆస్పత్రి విడుదల చేసిన తాజా హెల్త్ బులెటిన్ ప్రకారం, తీవ్రమైన పల్మనరీ ఎంబోలిజం కారణంగా ఆయనకు కార్డియాక్ అరెస్ట్ సంభవించిందని డాక్టర్లు తెలిపారు.

# ‘పాలమూరు’కు పచ్చజెండా

### సీతమ్మ సాగర్, గౌరవెల్లికీ.. టీజీ ప్రాజెక్టులకు సుప్రీం ఊరట



హైదరాబాద్, జూలై 29 (ఈవార్తలు): రాష్ట్రంలోని కీలక సాగునీటి ప్రాజెక్టులైన పాలమూరు-రంగారెడ్డి, సీతమ్మ సాగర్, గౌరవెల్లి రిజర్వాయర్‌లకు సుప్రీంకోర్టు భారీ ఊరట కల్పించింది. కేంద్ర పర్యావరణ అటవీ శాఖ 2021లో జారీ చేసిన ఆఫీస్ మెమోరాండంను సుప్రీంకోర్టు రద్దు చేసినప్పటికీ.. ఆ ఉత్తర్వు ఆధారంగా ఇప్పటికే మంజూరైన పర్యావరణ అనుమతులు మాత్రం పూర్తిగా చెల్లుబాటులోనే ఉంటాయని స్పష్టం చేసింది. దీంతో తెలంగాణలో కొనసాగుతున్న ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలకు ఎలాంటి చట్టపరమైన అడ్డంకులు ఉండబోవని స్పష్టమైంది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ తీర్పు భవిష్యత్తుకు మాత్రమే వర్తిస్తుందని పేర్కొంది. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న లేదా పూర్తి అయిన ప్రాజెక్టులపై ఈ తీర్పు ప్రభావం ఉండదని స్పష్టం చేసింది. దీంతో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కీలక సాగునీటి ప్రాజెక్టులకు ఊరట లభించినట్లు అయింది. అయితే భవిష్యత్తులో చేపట్టే కొత్త ప్రాజెక్టులకు మాత్రం ముందస్తు పర్యావరణ అనుమతులు తప్పనిసరి అని సుప్రీంకోర్టు ఈ సందర్భంగా తేల్చి చెప్పింది. కార్యనిర్వాహక ఉత్తర్వుల ద్వారా చట్టాలను భర్తీ చేయడం సాధ్యం కాదని పేర్కొన్న ధర్మాసనం.. అత్యవసర పరిస్థితుల్లో మినహాయింపులు ఇవ్వాలంటే కేంద్ర ప్రభుత్వం తప్పనిసరిగా చట్టబద్ధమైన నోటిఫికేషన్ జారీ చేయాలని సూచించింది. ప్రస్తుతం కొన్ని ప్రాజెక్టులకు నిర్మాణం ప్రారంభమైన తర్వాత పోస్ట్ ఫాక్టో పర్యావరణ అనుమతులు ఇచ్చే విధానాన్ని కేంద్రం 2021 ఆఫీస్ మెమోరాండం ద్వారా అమలు చేయడానికి ప్రయత్నించింది. అయితే అలాంటి అనుమతుల కోసం కేవలం ఆఫీస్ మెమోరాండం సరిపోదని.. చట్టబద్ధమైన నోటిఫికేషన్ ద్వారానే ఆ ప్రక్రియ అమలు చేయాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో భవిష్యత్తులో కేంద్ర ప్రభుత్వం చట్టబద్ధమైన నోటిఫికేషన్ జారీ చేసి పోస్ట్ ఫాక్టో పర్యావరణ అనుమతుల వ్యవస్థను అమలు చేసే అవకాశాలు ఉన్నాయి.

## బొగత ఉగ్రరూపం.. సందర్శన నిలిపివేత

ములుగు, జూలై 29 (ఈవార్తలు): వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ప్రభావంతో తెలంగాణలోని ఉత్తర జిల్లాల్లో ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ క్రమంలో ములుగు జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న కుండపోత వర్షాలకు ప్రసిద్ధ పర్యాటక ప్రాంతమైన బొగత జలపాతం ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. గత 10 గంటలుగా అటవీ ప్రాంతంలో వర్షం నిరంతరాయంగా కురుస్తుండటంతో ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరి జలపాతం ఉగ్రరూపం దాల్చింది. ఈ పరిస్థితుల నేపథ్యంలో, పర్యాటకుల భద్రతను దృష్టిలో ఉంచుకుని అటవీ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ములుగు జిల్లా వాజేడు మండలం చీకుపల్లి వద్ద ఉన్న బొగత జలపాతం సందర్శనను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. వరద ఉద్ధృతికి రాళ్లు జారే ప్రమాదం ఉండటంతో పాటు ప్రవాహం ఒక్కసారిగా పెరిగే అవకాశమున్నందున పర్యాటకులు ఎవరూ జలపాతం వైపు రావొద్దని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## రేవంత్ వల్లే ఏపీ రైతులు పంటలు

ఆత్మకూరు, జూలై 29 (ఈవార్తలు): ఎల్‌నినో ప్రతికూల ప్రభావం ఉన్నప్పటికీ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమకు నీళ్లు ఇస్తారనే ధీమాతోనే ఆంధ్రప్రదేశ్ రైతులు పంటలు సాగు చేస్తున్నారని బీఆర్ఎస్ జాతీయ కార్యదర్శి, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తీవ్ర స్థాయిలో ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యేలు చిట్టెం రామ్మోహన్ రెడ్డి, ఆల వెంకటేశ్వరరెడ్డిలతో కలసి ఈరోజు జూరాల ప్రాజెక్టును సందర్శించారు. అనంతరం ఆత్మకూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. జూరాల ప్రాజెక్టు నుంచి స్థానిక కుడి, ఎడమ ప్రధాన కాలువలకు నీటిని విడుదల చేయకుండా తెలంగాణ రైతులను గోస పెడుతున్నారని ఆయన మండిపడ్డారు. “రేవంత్ రెడ్డి ఎట్లయినా సరే ఆంధ్రకు నీళ్లు తరలిస్తారన్న ముందస్తు నమ్మకంతోనే అక్కడి రైతులు ధైర్యంగా విత్తనాలు వేసుకుంటున్నారు” అని వ్యాఖ్యానించారు.



మీరిచ్చే ప్రతి పైసా..
ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి ‘ఈవార్తలు’ నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి ‘ఈవార్తలు’. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811
నంబర్‌ను సంప్రదించవచ్చు.

## ఏఎస్సై వెంకటేశ్వర్లుకు ఎస్సైగా పదోన్నతి

జగిత్యాల టౌన్, జూలై 29 (ఈవార్తలు): జగిత్యాల టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహించి ఎస్ఐగా పదోన్నతి పొందిన వెంకటేశ్వర్లు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, ఐపీఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ వెంకటేశ్వర్లుకు ఎస్ఐ హోదాకు సంబంధించిన స్టార్ చిహ్నాలను అలంకరించి పదోన్నతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పదోన్నతి అనేది కేవలం హోదా పెరగడం మాత్రమే కాదని, బాధ్యతలు కూడా మరింత పెరుగుతాయని అన్నారు. పెరిగిన బాధ్యతలను క్రమశిక్షణ, నిజాయితీ, అంకితభావంతో నిర్వహించాలని సూచించారు. ప్రజల్లో పోలీసు శాఖపై విశ్వాసం, గౌరవం మరింత పెరిగేలా విధులు నిర్వర్తించాలని వెంకటేశ్వర్లుకు సూచించారు. కాగా, వెంకటేశ్వర్లు ఎస్ఐగా పదోన్నతి పొందిన సందర్భంగా బుధవారం జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో డా. సంజయ్ కుమార్ వెంకటేశ్వర్లుకు పుష్పగుచ్ఛం అందజేసి పదోన్నతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాసేవలో మరింత బాధ్యతతో, అంకితభావంతో విధులు నిర్వహించి పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే సూచించారు.



## రాహుల్ వైఖరి ఏం బాలేదు

### ప్రధాని నివాసం వద్ద ధర్నా సరికాదు: ఏసీఎస్ రాజు

జగిత్యాల టౌన్, జూలై 29 (ఈవార్తలు): కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ వ్యవహార శైలిపై భారత్ సురక్ష సమితి నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ ఏసీఎస్ రాజు మాట్లాడుతూ.. నీట్ పేపర్ లీక్ అంశంపై పార్లమెంట్‌లో చర్చించాల్సిన విషయాన్ని ప్రధానమంత్రి నివాసం వద్ద ధర్నా రూపంలో చేపట్టడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంపై విమర్శలు చేయడం సరికాదని, దేశ ప్రయోజనాలకు సంబంధించిన అంశాల్లో రాజకీయ పార్టీలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో 22వ వార్డు కౌన్సిలర్ అరవ లక్ష్మి, చిట్ల గంగాధర్, సింగం గంగాధర్, వేముల పోచమల్లు, నరేందుల శ్రీనివాస్, ఆర్ఎస్ఎస్ వీరన్న, కొత్తకొండ బాలన్న, ఎడమల వెంకట్‌రెడ్డి, ఇల్లెందుల పురుషోత్తం, బొందుకూరి శ్రీనివాస్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## రైతులకు 24 గంటల విద్యుత్ అందించాలి : జీవన్‌రెడ్డి

రాయికల్, జూలై 29 (ఈవార్తలు): రాయికల్, కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నీటి తరలింపునకు అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం చర్యలు చేపట్టలేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్‌రెడ్డి విమర్శించారు. బుధవారం రాయికల్ మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాజీ జడ్పీ తొలి చైర్‌పర్సన్ దావ వసంత సురేష్‌తో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులతో ఖరీఫ్ సాగు ప్రశ్నార్థకంగా మారిందని, ఇటీవల కురుస్తున్న వర్షాలు రైతులకు కొంత ఊరటనిచ్చాయని అన్నారు. ఇప్పటికే నారుమళ్లు సిద్ధంగా ఉన్నప్పటికీ నీటి కొరతతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఇప్పుడు కురిసిన వర్షాలతో నాట్లు వేసుకునే అవకాశం లభించిందని పేర్కొన్నారు. రైతులకు ఎలాంటి విద్యుత్ అంతరాయం లేకుండా 24 గంటల పాటు విద్యుత్ సరఫరా చేయాలని, ఎరువుల కొరత తలెత్తకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా డీఏపీ, 20-20 ఎరువులు, యూరియా రైతులకు అందుబాటులో ఉండేలా చూడాలని, బ్లాక్ మార్కెటింగ్‌ను అరికట్టాలని కోరారు. రైతులకు అవసరమైన అన్ని వ్యవసాయ ఇన్‌పుట్‌లను సకాలంలో అందించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ సమావేశంలో తాటిపర్తి సీకే రెడ్డి, బర్కం మల్లేశ్, గోపి రాజిరెడ్డి, కొయ్యేడి మైపాల్, హరీష్‌రావు, శ్రీధర్‌రెడ్డి, రవి తదితర నాయకులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధిలో బాధ్యతతో పనిచేయాలి

**వెల్గటూర్ సమీక్షలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్**

వెల్గటూర్, జూలై 29 (ఈవార్తలు): వెల్గటూర్, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, గ్రామాల్లో ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించేలా అధికారులు బాధ్యతతో పనిచేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. బుధవారం వెల్గటూర్ మండల అభివృద్ధి సమీక్ష సమావేశంలో ఆయన వివిధ శాఖల పనితీరును సమీక్షించారు. తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, విద్య, వైద్యం తదితర అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టాలని, రైతులు పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగుపై నిర్ణయం తీసుకోవాలని సూచించారు. అనంతరం ఎస్ఐఆర్ ప్రక్రియను వందశాతం పూర్తి చేసిన బీఎల్ఓలను మంత్రి సన్మానించారు.



## జగిత్యాల జిల్లాలో జోరువానలు

**జలమయమైన లోతట్టు ప్రాంతాలు**

**నీటమునిగిన లోలెవల్ వంతెనలు**

**పలు చోట్ల రాకపోకలకు అంతరాయం**

**అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన**

జగిత్యాల, జూలై 29 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని పలు మండలాల్లో అర్ధరాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షాలతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు లోలెవల్ వంతెనలు నీటమునగడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. జగిత్యాల పట్టణంలోని వెంకటాద్రినగర్-గోవిందుపల్లె వంతెనపై వరద నీరు ప్రవహించడంతో మున్సిపల్ అధికారులు జేసీబీ సాయంతో ప్రజలను సురక్షితంగా దాటించారు. నిజామాబాద్ రోడ్డుపై వరద నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జిల్లాలో అత్యధికంగా రాయికల్ మండలం అల్లీపూర్‌లో 69 మిల్లీమీటర్లు, రాయికల్‌లో 60.3, మల్యాలలో 58.3, సారంగాపూర్‌లో 57.8, జగిత్యాలలో 52.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ లోలెవల్ వంతెనలను పరిశీలించి అధికారులను అప్రమత్తం చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో కలెక్టరేట్ హెల్ప్‌డెస్క్ 7989193131ను సంప్రదించాలని అధికారులు సూచించారు.

## వర్షాకాలం.. కరెంటుతో జాగ్రత్త: ఎస్ఈ సుదర్శనం

జగిత్యాల, జూలై 29 (ఈవార్తలు): జగిత్యాల, వర్షాకాలంలో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులు, భారీ వర్షాల కారణంగా విద్యుత్ ప్రమాదాలు సంభవించే అవకాశం ఎక్కువగా ఉంటుందని జగిత్యాల విద్యుత్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ బి. సుదర్శనం తెలిపారు. విద్యుత్ మన జీవితానికి ఎంతో అవసరమైనదే అయినప్పటికీ, చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ప్రాణాంతక ప్రమాదాలకు దారితీస్తుందని హెచ్చరించారు. వర్షం సమయంలో తడిసిన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, తెగిపోయిన లేదా వేలాడుతున్న విద్యుత్ తీగలను తాకరాదని, తడి చేతులతో స్విచ్‌లు, ప్లగ్‌లు, ఇతర విద్యుత్ పరికరాలు ఉపయోగించవద్దని సూచించారు. ఇంటి వైరింగ్‌కు నాణ్యమైన ఎర్తింగ్ ఉండేలా చూసుకోవడంతో పాటు, పాడైన వైర్లను వెంటనే మార్చాలని, విద్యుత్ మరమ్మతులు అర్హత కలిగిన ఎలక్ట్రిషియన్‌తోనే చేయించాలని తెలిపారు. రైతులు వ్యవసాయ మోటార్లు వినియోగించే ముందు స్టార్టర్లు, వైర్లు, ఎర్తింగ్‌ను పరిశీలించాలని, విద్యుత్ లైన్ల సమీపంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. విద్యుత్ ప్రమాదాలు లేదా లోపాలు గమనించిన వెంటనే టీజీఎన్‌పీడీసీఎల్ టోల్‌ఫ్రీ నంబర్ 1912కు సమాచారం ఇవ్వాలని, విద్యుత్ భద్రతా నియమాలు పాటించి సురక్షితంగా ఉండాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## విద్యార్థులకు స్టార్టప్‌లపై అవగాహన

**కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ వినూత్న చర్య**

కోరుట్ల, జూలై 29 (ఈవార్తలు): కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఆధ్వర్యంలో మెట్‌పల్లి-కోరుట్ల డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు హైదరాబాద్‌లోని టీహబ్, టీవర్క్స్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆధునిక సాంకేతికత, స్టార్టప్‌ల అభివృద్ధి, యువతకు అందుబాటులో ఉన్న నైపుణ్యాభివృద్ధి అవకాశాలపై అవగాహన పొందారు. టీహబ్‌లో స్టార్టప్‌లకు అందిస్తున్న మార్గదర్శకత్వం, మెంటరింగ్, పెట్టుబడుల అవకాశాలను తెలుసుకోగా, టీ--వర్క్స్‌లో ప్రోటోటైపింగ్, ఉత్పత్తుల రూపకల్పనకు ఉపయోగించే ఆధునిక పరికరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ మాట్లాడుతూ.. విద్యతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా కొత్త అవకాశాలను సృష్టించే స్థాయికి యువత ఎదగాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ప్రపంచస్థాయి సాంకేతికతను పరిచయం చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ పర్యటనతో తమలో కొత్త ఆలోచనలు, ఆత్మవిశ్వాసం పెరిగాయని, భవిష్యత్ లక్ష్యాలపై మరింత స్పష్టత వచ్చిందని విద్యార్థులు తెలిపారు.

# కుల వివక్ష ఉన్నంతవరకు రిజర్వేషన్లు ఉండాలె

**తెలంగాణ వెనుకబడిన వర్గాల సదస్సులో వక్తలు**

హైదరాబాద్, జూలై 29 (ఈవార్తలు): భారత రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లు దానం కాదని, సామాజిక న్యాయం సాధనకు రాజ్యాంగం ప్రసాదించిన హక్కులని తెలంగాణ వెనుకబడిన వర్గాల సదస్సులో వక్తలు స్పష్టం చేశారు. దేశంలో కుల వివక్ష, సామాజిక అసమానతలు కొనసాగుతున్నంతకాలం రిజర్వేషన్ల అవసరం ఉంటుందని వారు పేర్కొన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం కళల కళాశాలలోని ప్రజాపరిపాలన సదస్సు మందిరంలో ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థులు, పరిశోధకుల ఆధ్వర్యంలో "తెలంగాణ ఓబీసీ సింపోజియం"ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పరిశోధకులు మహేష్ గౌడ్, కడారి రమేష్ యాదవ్ అధ్యక్షత వహించారు. ఈ సదస్సుకు ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త ఆచార్య కంచ ఐలయ్య, పదవీ విరమణ పొందిన భారత పరిపాలనా సేవాధికారి టి. చిరంజీవులు, ఆచార్య కోదండరాం, కొండా నాగేశ్వర్, ఆచార్య రాములు, ఆచార్య ఖాసీం, సీనియర్ విద్యార్థి నాయకులు యాలాద్రి, డాక్టర్ ఎస్. నాగేశ్వరరావు, స్వాతి, ఆజాద్, నిజ్జన రమేష్ ముదిరాజ్, డాక్టర్ శివ ముదిరాజ్ (హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం), శివ యాదవ్ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. వక్తలు మాట్లాడుతూ, భారతదేశంలో కుల ఆధారిత వివక్ష, సామాజిక అసమానతలు, విద్యా, ఉపాధి అవకాశాల్లో వెనుకబాటుతనం కొనసాగుతున్నంతకాలం రిజర్వేషన్ల అవసరం ఉంటుందని పేర్కొన్నారు. దేశ జనాభాలో అత్యధిక శాతం ఉన్న వెనుకబడిన వర్గాలకు సామాజిక, రాజకీయ, విద్యా, ఆర్థిక, ఉపాధి రంగాల్లో జనాభా దామాషా ప్రకారం ప్రాతినిధ్యం, రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే దేశవ్యాప్తంగా కుల గణన నిర్వహించి, దాని ఆధారంగా సంక్షేమ, అభివృద్ధి విధానాలను రూపొందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. ఇటీవల సామాజిక మాధ్యమాల వేదికగా కొందరు "సాధారణ వర్గ ఉద్యమం" పేరుతో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ప్రచారం చేయడం ఆందోళనకరమని పేర్కొన్నారు. ఇప్పటికే వివిధ వర్గాలకు ప్రత్యేక అవకాశాలు, రిజర్వేషన్లు అమలులో ఉన్నప్పటికీ, సామాజిక న్యాయానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఇటువంటి ప్రచారాలు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమేనని విమర్శించారు. ప్రతిభను కేవలం పరీక్షల్లో సాధించిన మార్కులతో మాత్రమే కొలవలేమని, సమాన అవకాశాలు, సామాజిక పరిస్థితులు, చారిత్రక అన్యాయాలను పరిగణనలోకి తీసుకున్నప్పుడే నిజమైన ప్రతిభ వెలుగులోకి వస్తుందని వక్తలు పేర్కొన్నారు. అందువల్ల రిజర్వేషన్లు సమానత్వాన్ని సాధించేందుకు రాజ్యాంగం కల్పించిన కీలక సాధనమని స్పష్టం చేశారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, విద్యలో అందుబాటు, రాజకీయ ప్రాతినిధ్యం, ఉపాధిలో సమాన భాగస్వామ్యం వంటి అంశాలపై సమగ్ర చర్చ జరగాల్సిన అవసరం ఉందని, యువత రాజ్యాంగ విలువలను పరిరక్షించే దిశగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జన సమితి నాయకులు పల్లె వినయ్ గౌడ్, ఆశప్ప, సలీం పాషా, తుల్జా రెడ్డి, విద్యార్థి నాయకులు దప్పు గోపి, శివరాజ్‌తో పాటు ఉస్మానియా విశ్వవిద్యాలయానికి చెందిన వివిధ విద్యార్థి సంఘాల నాయకులు, పరిశోధకులు, అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# భారీ వర్షంలోనూ కొండగట్టు గిరిప్రదక్షిణ

**రైతుల సంక్షేమం కోసం ప్రత్యేక పూజలు.. వర్షాల కోసం అంజన్నను ప్రార్థించిన మంత్రులు, ఎమ్మెల్యేలు**

మల్యాల/జగిత్యాల/వేములవాడ/కరీంనగర్, జూలై 29 (ఈవార్తలు): కొండగట్టు, గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని జగిత్యాల జిల్లా కొండగట్టులో బుధవారం 43వ గిరిప్రదక్షిణ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది. చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు డా. మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఉదయం నుంచి కురుస్తున్న భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా వేలాది మంది భక్తులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు గిరిప్రదక్షిణను పూర్తి చేశారు. అనంతరం శ్రీ కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకుని రాష్ట్ర ప్రజల సంక్షేమం, రైతుల సుభిక్షం, సమృద్ధిగా వర్షాలు కురవాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎల్-నినో ప్రభావం తొలగి పంటలు బాగా పండాలని అంజన్నను వేడుకున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, ప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రముఖ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తోందన్నారు. ఎల్-నినో ప్రభావంతో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తొలగి సమృద్ధిగా వర్షాలు కురవాలని, ప్రజలంతా ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలని అంజన్నను ప్రార్థించామని తెలిపారు. జిల్లా అభివృద్ధి కోసం అందరం కలిసికట్టుగా పనిచేస్తామని, ఇది రాజకీయ కార్యక్రమం కాదని, సకలజనుల సంక్షేమం కోసం నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమమని స్పష్టం చేశారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలోని దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కొండగట్టు క్షేత్రాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, రైతుల కష్టాలు తొలగి రాష్ట్రంలో సకాలంలో వర్షాలు కురవాలని, ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని ఆధ్యాత్మిక భావనతో గిరిప్రదక్షిణ చేపట్టామని చెప్పారు. భారీ వర్షంలోనూ పాల్గొన్న ప్రతి భక్తుడికి, కాంగ్రెస్ కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, హుజురాబాద్ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఒడితల ప్రణవ్ బాబు, మాజీ సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన కుమార్‌తో పాటు జిల్లా వ్యాప్తంగా మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, సర్పంచులు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, సహకార సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, వేలాది మంది అంజన్న భక్తులు పాల్గొన్నారు.



## సొంత అల్లుడే మాస్టర్‌మైండ్

**మనుమడితో కలిసి మామ ఇంట్లోనే డెకాయిటీ!**

**భగత్‌నగర్ సంచలన కేసును ఛేదించిన పోలీసులు**

కరీంనగర్, జూలై 29 (ఈవార్తలు): కరీంనగర్ నగరంలోని భగత్‌నగర్‌లో ఇటీవల సంచలనం సృష్టించిన ఇంటి డెకాయిటీ కేసును పోలీసులు చాకచక్యంగా ఛేదించారు. కుటుంబ సభ్యులను డమ్మీ పిస్టళ్లు, కత్తులతో బెదిరించి చేతులు, కాళ్లు కట్టేసి నగదు, బంగారం, వెండి ఆభరణాలను దోచుకెళ్లిన ఈ ఘటన వెనుక బాధితుడి సొంత అల్లుడు, మనుమడే మాస్టర్‌మైండ్‌లు అని దర్యాప్తులో తేలింది. కేసు నమోదు చేసిన వెంటనే ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసిన కరీంనగర్ పోలీసులు ఘటనా స్థలం నుంచి నిందితులు పారిపోయిన మార్గాల వరకు ఉన్న సీసీటీవీ ఫుటేజీలను నిశితంగా పరిశీలించారు. దోపిడీ అనంతరం దొంగిలించిన ద్విచక్ర వాహనాలపై హుజురాబాద్ వైపు వెళ్లిన నిందితులు, పెద్ద పాపయ్యపల్లి సమీపంలో వాటిని వదిలేసి పరారైనట్లు గుర్తించారు. సాంకేతిక ఆధారాలతో నిందితుల జాడను కనిపెట్టి ఉత్తరప్రదేశ్‌లోని మీరట్ వరకు వెళ్లిన పోలీసులు స్థానిక పోలీసుల సహకారంతో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయిన వారు సల్మాన్ అలియాస్ భూరే అలియాస్ యాదవ్ (22), సల్మాన్ అలియాస్ విమాన్ (22), మొహమ్మద్ హసీన్ (19). వీరి వద్ద నుంచి రూ.2.09 లక్షల నగదు, 43.67 గ్రాముల బంగారు ఆభరణాలు, 64.98 గ్రాముల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన వివరాలు మరింత ఆశ్చర్యానికి గురిచేశాయి. బాధితుడు ఎం.డి. అజ్మత్ అలీ సొంత అల్లుడు రజావుద్దీన్ గతంలో కొంతకాలం మామ ఇంట్లోనే నివసించాడు. ఆ సమయంలో ఇంట్లో ఉన్న నగదు, బంగారు ఆభరణాలపై పూర్తి సమాచారం సేకరించాడు. వ్యాపార నష్టాలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్న అతను మామ వద్ద రూ.5 లక్షలు ఇవ్వాలని ఒత్తిడి చేసినా నిరాకరణ ఎదురుకావడంతో ప్రతీకారం తీర్చుకోవాలని నిర్ణయించుకున్నాడు. తన కుమారుడు అజీమ్ రజాతో పాటు మీరట్‌కు చెందిన సహచరులను రంగంలోకి దింపి పక్కా ప్రణాళిక రచించాడు. ఈ నెల 20న మీరట్ నుంచి రామగుండం చేరుకున్న ముఠా, 21వ తేదీ అర్ధరాత్రి భగత్‌నగర్‌లోని ఇంట్లోకి చొరబడి కుటుంబ సభ్యులను బెదిరించి నగదు, బంగారం, వెండి ఆభరణాలను దోచుకుని పరారైంది. అరెస్టయిన ముగ్గురు నిందితులను ట్రాన్సిట్ వారెంట్‌పై కరీంనగర్‌కు తీసుకొస్తుండగా, కేసులో ప్రధాన నిందితులైన రజావుద్దీన్ (ఏ1), అజీమ్ రజా (ఏ2)తో పాటు పరారీలో ఉన్న ఇతర నిందితుల కోసం ప్రత్యేక పోలీసు బృందాలు ముమ్మరంగా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. పకడ్బందీ సాంకేతిక దర్యాప్తు, సీసీటీవీ విశ్లేషణ, రాష్ట్రాల మధ్య సమన్వయంతో ఈ సంచలన కేసును ఛేదించిన కరీంనగర్ పోలీసుల పనితీరుపై ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.

# కాలానికి అనుగుణంగా కూరగాయల సాగు

**రైతును అభినందించిన కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**ఎల్‌నినో ప్రభావాన్ని అధిగమించేందుకు**

**మారుపాక రైతు వినూత్న సాగు**

వేములవాడ అర్బన్, జూలై 29 (ఈవార్తలు): వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావం, తగ్గుతున్న భూగర్భ జలాలను దృష్టిలో పెట్టుకుని సంప్రదాయ వరి సాగుకు బదులుగా కూరగాయల సాగు చేపట్టిన వేములవాడ అర్బన్ మండలం మారుపాక గ్రామానికి చెందిన రైతు చెరుకు తిరుపతిని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అభినందించారు. తనకు ఉన్న ఐదు ఎకరాల వ్యవసాయ భూమిలో వరి సాగు చేయకుండా, తక్కువ నీటితో అధిక ఆదాయం వచ్చే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని నిర్ణయించుకున్న తిరుపతి ప్రస్తుతం 30 గుంటల్లో బీరకాయ, కాకరకాయ, బెండకాయ, గోరుచిక్కుడు, సొరకాయ, మెంతికూర వంటి ఆరు రకాల కూరగాయలను సాగు చేస్తున్నారు. ఇప్పటికే బీరకాయ పంట దిగుబడికి రావడంతో పాటు మిగిలిన భూమిలో కూడా వివిధ రకాల కూరగాయల సాగుకు ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నారు. 'రైతు నేస్తం' కార్యక్రమంలో భాగంగా మారుపాక గ్రామాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, రైతు పొలానికి వెళ్లి సాగు విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. ఏ పంటలు సాగు చేస్తున్నారో, ఎంత విస్తీర్ణంలో వేశారో, సాగులో అనుసరిస్తున్న పద్ధతులు, నీటి వినియోగం తదితర అంశాలను రైతును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు సంప్రదాయ నీటి ఆధారిత పంటలపై పూర్తిగా ఆధారపడకుండా ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లడం అవసరమని అన్నారు. తక్కువ నీటితో అధిక ఆదాయం అందించే కూరగాయల సాగు మంచి ప్రత్యామ్నాయమని పేర్కొన్నారు. సేంద్రియ ఎరువులను వినియోగిస్తూ కూరగాయల సాగు చేపడితే ఉత్పత్తుల నాణ్యత పెరగడంతో పాటు రైతులకు మరింత ఆదాయం లభించే అవకాశముందని తెలిపారు. ఉద్యానవన శాఖ, వ్యవసాయ శాఖ అందించే ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, సాంకేతిక సహాయాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని జిల్లాలోని రైతులంతా తమ భూముల్లో ఆరుతడి పంటలు, కూరగాయలు వంటి ప్రత్యామ్నాయ సాగు విధానాలను అవలంబించి నష్టాలను తగ్గించుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ పరిశీలనలో వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, ఆత్మ కమిటీ వేములవాడ డివిజన్ అధ్యక్షుడు ముస్కు ముకుందరెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, తహసీల్దార్ జయంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## వేములవాడలో 12 అంగన్‌వాడీ పోస్టులకు నోటిఫికేషన్

వేములవాడ అర్బన్, జులై 29 (ఈవార్తలు): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న 12 అంగన్‌వాడీ ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైనట్లు ప్రాజెక్టు సీడీపీఓ సౌందర్య తెలిపారు. మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ నియామకాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. అర్హులైన స్థానిక మహిళా అభ్యర్థులు జులై 28 ఉదయం 11.30 గంటల నుంచి ఆగస్టు 7 సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తులను అధికారిక వెబ్‌సైట్ ద్వారా మాత్రమే సమర్పించాలని, ప్రత్యక్షంగా లేదా మాన్యువల్ రూపంలో సమర్పించే దరఖాస్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ స్వీకరించబోమని స్పష్టం చేశారు. దరఖాస్తుదారులు తప్పనిసరిగా ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై ఉండాలి. 2026 జులై 1 నాటికి 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలి. సంబంధిత అంగన్‌వాడీ కేంద్ర పరిధిలోని గ్రామం లేదా పట్టణ వార్డుకు చెందిన స్థానిక మహిళ కావడం తప్పనిసరి. గత ఏడాది కాలంలో తహసీల్దార్ జారీ చేసిన నివాస ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. అభ్యర్థుల ఎంపికను 100 మార్కుల ప్రాతిపదికన నిర్వహిస్తారు. ఇందులో ఇంటర్మీడియట్ విద్యార్హతకు 70 మార్కులు, వితంతువులు, అనాథలు, దివ్యాంగులు వంటి ప్రత్యేక విభాగాలకు అదనపు మార్కులు, జిల్లా ఎంపిక కమిటీ నిర్వహించే ముఖాముఖి పరీక్షకు 10 మార్కులు కేటాయించినట్లు వివరించారు. దరఖాస్తు సమయంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ మెమోలు, కుల ధ్రువీకరణ పత్రం, నివాస ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, ప్రత్యేక విభాగానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాల స్కాన్ కాపీలను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలని సీడీపీఓ సౌందర్య సూచించారు.

## వకుళాభరణం కృష్ణ మోహన్ రావుకు జాతీయ పురస్కారం

న్యూఢిల్లీ: తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్, బీజేపీ సీనియర్ నాయకుడు డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావుకు జాతీయ తెలుగు సారస్వత పరిషత్ ప్రతిష్ఠాత్మక 'జాతీయ విశిష్ట సేవా పురస్కారం' ప్రదానం చేసింది .న్యూఢిల్లీలోని ఆంధ్రా అసోసియేషన్ భవన్లో మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించిన 'హస్తినలో తెలుగు వెలుగు' వేడుకల్లో కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి శ్రీ భూపతిరాజు శ్రీనివాస వర్మ ఈ పురస్కారాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు. ప్రజా జీవితం, వెనుకబడిన వర్గాల సంక్షేమం, తెలుగు భాషా--సాహిత్యాభివృద్ధి, సామాజిక రంగాల్లో డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావు అందించిన విశిష్ట సేవలను గుర్తించి ఈ పురస్కారాన్ని ప్రదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్ రావు, జాతీయ తెలుగు సారస్వత పరిషత్ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ రామప్రసాద్, పరిషత్ ప్రతినిధులు ముత్యాల శ్రీనివాస్, డాక్టర్ సుధీర్ రమణ, కాంతేటి వెంకటరాజు, ఆదిలీలా ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఎస్. ఆదినారాయణతో పాటు రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన సాహితీవేత్తలు, కళాకారులు, సామాజికవేత్తలు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతి వైభవాన్ని చాటిచెప్పేలా అత్యంత వైభవంగా ఈ వేడుకలు నిర్వహించారు.






## ఒక్క వర్షానికే చెరువులకు జలకళ

మల్యాల, జూలై 29 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండలంలో కురిసిన ఒక్క భారీ వర్షానికే చెరువులు, కుంటలు నిండుకుండలను తలపిస్తూ జలకళను సంతరించుకున్నాయి. ఇటీవల వరకు వర్షాభావంతో ఆందోళన చెందిన రైతులు, తాజా వర్షాలతో నీటి వనరులు నిండిపోవడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాలతో చెరువులు, కుంటల్లోకి వరద నీరు భారీగా చేరడంతో భూగర్భ జలమట్టం పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో వరి, పత్తి, మొక్కజొన్న తదితర ఖరీఫ్ పంటల సాగుకు అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయని రైతులు తెలిపారు. ఇదే తరహాలో మరికొన్ని వర్షాలు కురిస్తే సాగునీటి కొరత పూర్తిగా తీరడంతో పాటు ఖరీఫ్ సాగు సాఫీగా సాగుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. నీటి వనరులు పుష్కలంగా నిండిపోవడంతో పశువులకు కూడా తాగునీటి సమస్య తగ్గనుందని పేర్కొంటున్నారు. తాజా వర్షాలతో మండలమంతా పచ్చదనంతో కళకళలాడుతుండగా, చెరువులు, కుంటలు జలకళను సంతరించుకోవడం స్థానికులకు, రైతులకు కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఈ వర్షాలు వ్యవసాయానికి మేలు చేసి మంచి దిగుబడులు సాధించేందుకు దోహదపడతాయని రైతులు ఆశిస్తున్నారు.

# ఈకేవైసీ.. సంక్షేమానికి పరీక్ష

## వలస కార్మికుల పరిస్థితి ఏంటి?.. ఆందోళనకరంగా వృద్ధుల పరిస్థితి

## వేలి ముద్ర రాకపోతే రేషన్ ఇవ్వరా?.. ఐరిస్ సదుపాయం ఎందుకు ఉండదు?

**(శ్రీశైలం దూడం, సీనియర్ జర్నలిస్టు)**

రేషన్ కార్డుల ఈకేవైసీని తప్పనిసరి చేయడంలో ప్రభుత్వ ఉద్దేశాన్ని ఎవరూ తప్పుబట్టలేరు. నకిలీ లబ్ధిదారులను గుర్తించడం, అర్హులకు మాత్రమే సంక్షేమ ఫలాలు అందించడం, ప్రజాపంపిణీ వ్యవస్థను పారదర్శకంగా మార్చడం దీని లక్ష్యం. అయితే ప్రతి సంస్కరణ ప్రజల జీవన వాస్తవాలకు అనుగుణంగా అమలైతేనే దాని అసలు ప్రయోజనం కనిపిస్తుంది. ప్రస్తుతం ఈకేవైసీ అమలులో అలాంటి ప్రశ్నలే తలెత్తుతున్నాయి. జూలై 31తో గడువు ముగియనున్న నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా వేలాది కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి. తెలంగాణ నుంచి ఉపాధి కోసం ముంబై, పుణె, బెంగళూరు, సూరత్, చెన్నై, ఢిల్లీ తదితర ప్రాంతాలకు వెళ్లిన వలస కార్మికులు గడువులోగా స్వగ్రామాలకు చేరుకోవడం సాధ్యంకాని పరిస్థితి ఉంది. అలాగే ఉన్నత విద్య కోసం హైదరాబాద్‌తో పాటు ఇతర నగరాలు, ఇతర రాష్ట్రాల్లో చదువుతున్న విద్యార్థులు కూడా ఈకేవైసీ కోసం స్వగ్రామంలోని రేషన్ దుకాణానికి రావాల్సి వస్తోంది. కుటుంబంలోని ఒక్క సభ్యుడు బయట ఉన్నా మొత్తం కుటుంబం ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొంది. వృద్ధుల పరిస్థితి మరింత ఆందోళన కలిగిస్తోంది. వయస్సు ప్రభావంతో చాలామందికి వేలిముద్రలు స్కానింగ్‌లో నమోదు కావడం లేదు. పలుమార్లు ప్రయత్నించినా యంత్రం గుర్తించకపోవడంతో డీలర్లు కూడా "వేలిముద్ర రావడం లేదు... మేమేం చేయలేం" అనే సమాధానమే చెబుతున్నారు. దీనికి రేషన్ డీలర్లను బాధ్యులను చేయడం సరికాదు. అసలు ప్రశ్న పౌర సరఫరాల శాఖ ముందుంది. ఆధార్ వ్యవస్థలో ఐరిస్ ద్వారా ధ్రువీకరణకు అవకాశం ఉన్నప్పటికీ, రేషన్ దుకాణాల్లో ఐరిస్ స్కానింగ్ పరికరాలు లేకపోవడం వల్ల వృద్ధులు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ లోటును అత్యవసరంగా సరిచేయాల్సిన అవసరం ఉంది. మరో కీలక అంశం ఈకేవైసీని కేవలం రేషన్ దుకాణాలకే పరిమితం చేయడం. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా మీసేవ కేంద్రాలు, ఆధార్ సేవా కేంద్రాలు, కామన్ సర్వీస్ సెంటర్లు (సీఎస్‌సీలు) బయోమెట్రిక్ సేవలు అందిస్తున్నాయి. ప్రభుత్వం అనుమతించిన ఈ కేంద్రాల్లో కూడా వేలిముద్ర లేదా ఐరిస్ ద్వారా ఈకేవైసీ పూర్తి చేసుకునే అవకాశం కల్పిస్తే వలస కార్మికులు, విద్యార్థులు, ఉద్యోగులు, వృద్ధులకు ప్రయాణ భారం, సమయ నష్టం తగ్గుతుంది. దేశంలో 'వన్ నేషన్-వన్ రేషన్ కార్డ్' అమల్లో ఉన్నప్పుడు, మరో రాష్ట్రంలో రేషన్ పొందగలిగే లబ్ధిదారుడు అక్కడి నుంచే ఈకేవైసీ పూర్తి చేసుకునే సౌకర్యాన్ని కూడా పరిశీలించాల్సిన




సమయం వచ్చింది. డిజిటల్ పాలన అంటే కేవలం బయోమెట్రిక్ ధ్రువీకరణ కాదు; ప్రజలకు అందుబాటులో ఉండే ప్రత్యామ్నాయాలను కూడా కల్పించడం. సంక్షేమ పథకాల లక్ష్యం అర్హులను జాబితా నుంచి తొలగించడం కాదు; అర్హులందరికీ హక్కుగా ప్రయోజనాలు అందించడం. అందుకే పౌర సరఫరాల శాఖ మంత్రి, కమిషనర్ ఈ అంశాన్ని అత్యవసరంగా సమీక్షించి అవసరమైతే గడువు పునఃసమీక్ష, ఐరిస్ స్కానింగ్ పరికరాల ఏర్పాటు, మీసేవ-సీఎస్‌సీ కేంద్రాల ద్వారా ఈకేవైసీ సదుపాయం, వలస కార్మికులు, విద్యార్థులు, వృద్ధులకు ప్రత్యేక వెసులుబాటు వంటి అంశాలపై నిర్ణయం తీసుకోవాలి. వేలిముద్ర పడకపోవడం వృద్ధుడి తప్పు కాదు. ఉపాధి కోసం వలస వెళ్లడం కార్మికుడి నేరం కాదు. చదువు కోసం స్వగ్రామానికి దూరంగా ఉండడం విద్యార్థి పొరపాటు కాదు. ప్రజల అవసరాలకు అనుగుణంగా వ్యవస్థను మార్చినప్పుడే డిజిటల్ సంక్షేమ పాలన తన అసలు లక్ష్యాన్ని చేరుకుంటుంది.

# స్టాక్ మార్కెట్ భారీ ర్యాలీ

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం భారీ లాభాలతో ముగిశాయి. ఐటీ, ఎఫ్ఎంసీజీ, మెటల్ షేర్లలో బలమైన కొనుగోళ్లు కనిపించడంతో సూచీలు జోరుగా ఎగిశాయి. సెన్సెక్స్ 889 పాయింట్లు (1.16 శాతం) పెరిగి 77,654.60 వద్ద ముగిసింది. నిఫ్టీ 265 పాయింట్లు (1.10 శాతం) లాభపడి 24,250.20 వద్ద స్థిరపడింది. నిఫ్టీకి ప్రస్తుతం 24,300-24,400 స్థాయులు కీలక నిరోధంగా ఉన్నాయని మార్కెట్ నిపుణులు తెలిపారు. ఈ స్థాయిని దాటితే మరింత బుల్లిష్ ట్రెండ్‌కు అవకాశం ఉంటుందని అంచనా వేశారు. 24,400-24,500 స్థాయుల దిశగా నిఫ్టీ కదిలే అవకాశముందని పేర్కొన్నారు. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 0.82 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 1.48 శాతం చొప్పున పెరిగాయి. హిందుస్థాన్ యూనిలీవర్, ఇన్ఫోసిస్ షేర్లు అత్యధిక లాభాలు నమోదు చేసి మార్కెట్‌కు ప్రధాన బలంగా నిలిచాయి. ట్రెంట్, టాటా స్టీల్ షేర్లు కూడా ర్యాలీ అయ్యాయి. మరోవైపు మహీంద్రా అండ్ మహీంద్రా, పవర్‌గ్రిడ్, ఎన్‌టీపీసీ షేర్లు నష్టాల్లో ముగిశాయి. ఐటీ, ఎఫ్ఎంసీజీ, మెటల్ రంగాల్లో బలమైన కొనుగోళ్లు మార్కెట్‌కు ఊతమిచ్చాయి.

# 2,000 నౌకలతో ఎల్‌నినోపై యుద్ధం

## భారత రుతుపవనాలకు మేలు జరుగుతుందని అంచనా!

న్యూఢిల్లీ: ప్రపంచ వాతావరణాన్ని, ముఖ్యంగా భారత రుతుపవనాలను తీవ్రంగా ప్రభావితం చేసే 'గాడ్జిల్లా' (అతి తీవ్రమైన) ఎల్ నినోను అడ్డుకునేందుకు శాస్త్రవేత్తలు ఒక సాహసోపేతమైన, అదే సమయంలో వివాదాస్పదమైన ప్రతిపాదనను ముందుకు తెచ్చారు. దక్షిణ అమెరికాలోని పెరూ, చిలీ తీర ప్రాంతాల్లో సుమారు 2,000 నౌకల ద్వారా సముద్రపు నీటిని స్ప్రే చేసి, మేఘాల ప్రకాశాన్ని పెంచడం ద్వారా ఎల్ నినో తీవ్రతను తగ్గించవచ్చని వారు సూచిస్తున్నారు. ఈ ప్రక్రియ విజయవంతమైతే, భారత్‌లో రుతుపవనాలు సాధారణ స్థితికి వచ్చి, వ్యవసాయ రంగానికి మేలు జరుగుతుందని అంచనా వేస్తున్నారు. అయితే, ఇది కేవలం సైద్ధాంతిక నమూనాలపై ఆధారపడిన ప్రతిపాదనే కావడం, వాస్తవిక ప్రపంచంలో దీనిని పరీక్షించకపోవడంతో దీనిపై తీవ్ర చర్చ జరుగుతోంది. స్క్రిప్స్ ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఓషనోగ్రఫీకి చెందిన జెస్సికా ఎస్. వాన్ నేతృత్వంలోని శాస్త్రవేత్తల బృందం 'సైన్స్ అడ్వాన్సెస్' జర్నల్‌లో ఈ అధ్యయనాన్ని ప్రచురించింది.



వారి ప్రతిపాదన ప్రకారం, ఎల్ నినో ప్రభావం మొదలయ్యే జూన్ నుంచి ఫిబ్రవరి మధ్య దాదాపు తొమ్మిది నెలల పాటు పెరూ, చిలీ తీరంలో ఈ ప్రయోగం చేపట్టాలి. ఇందుకు భారతదేశ విస్తీర్ణమంత సముద్ర ప్రాంతాన్ని ఎంచుకోవాలి. ఎంపిక చేసిన నౌకలు సముద్రపు నీటిని అత్యంత సూక్ష్మమైన తుంపరల రూపంలో గాలిలోకి స్ప్రే చేస్తాయి. నీరు ఆవిరైపోగా, అందులోని ఉప్పు కణాలు మేఘాలు ఏర్పడటానికి కేంద్రకాలుగా (క్లౌడ్ కండెన్సేషన్ న్యూక్లియై) పనిచేస్తాయి. ఫలితంగా, మేఘాలలో నీటి బిందువులు చిన్నవిగా, అధిక సంఖ్యలో ఏర్పడి, మేఘాలు మరింత ప్రకాశవంతంగా, తెల్లగా మారతాయి. ఈ తెల్లటి మేఘాలు సూర్యరశ్మిని అధికంగా అంతరిక్షంలోకి పరావర్తనం చెందిస్తాయి. తత్ఫలితంగా వాటి కింద ఉన్న సముద్ర ఉపరితలం చల్లబడుతుంది. సముద్రం చల్లబడటం వల్ల ఆ ప్రాంతంలో గాలి పీడనం పెరిగి, తూర్పు నుంచి పశ్చిమ దిశగా వీచే పసిఫిక్ వాణిజ్య పవనాలు బలపడతాయి. ఇది ఎల్ నినోను మరింత ఉద్ధృతం చేసే 'బ్జెర్క్‌నెస్ ఫీడ్‌బ్యాక్' అనే విష వలయాన్ని ఛేదిస్తుంది. 1997, 2015 నాటి తీవ్రమైన ఎల్ నినోలను తమ నమూనాల్లో పునఃసృష్టించి ఈ ప్రయోగాన్ని పరీక్షించగా, ఉష్ణోగ్రతలు సుమారు 1.5 డిగ్రీల సెల్సియస్ మేర తగ్గినట్లు తేలింది. సాధారణంగా, తీవ్రమైన ఎల్ నినో సంవత్సరాల్లో భారత నైరుతి రుతుపవనాలు బలహీనపడి, వర్షపాతం తగ్గుతుంది. ఇది దేశంలోని సగం వ్యవసాయ భూమిపై ఆధారపడిన రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తుంది. ఒకవేళ ఈ క్లౌడ్ బ్రైటెనింగ్ ప్రయోగం ద్వారా ఎల్ నినో తీవ్రతను తగ్గించగలిగితే, దక్షిణాసియాలో వేడిమి తగ్గి, రుతుపవనాలు మెరుగుపడతాయని ఈ అధ్యయనం పేర్కొంది. ఎల్ నినో ప్రభావిత 14 ప్రాంతాలను పరిశీలించగా, ఈ ప్రయోగం వల్ల దక్షిణాసియాలో సానుకూల ప్రభావం ఉంటుందని తేలింది.

# కొన్ని వాహనాల్లో మార్పులు అవసరమే

**ఈ20 పెట్రోల్‌పై కేంద్రం కీలక ప్రకటన**

న్యూఢిల్లీ: ఈ20 పెట్రోల్ తో వాహనాలకు ఎలాంటి ఇబ్బంది లేదని చెబుతూ వస్తున్న కేంద్రం తాజాగా కీలక ప్రకటన చేసింది. ఈ20 వాడాలంటే 2016కు ముందు తయారైన కొన్ని వాహనాల్లో మాత్రమే స్వల్ప మార్పులు అవసరమవుతాయని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ స్పష్టం చేశారు. ముఖ్యంగా 2005 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చిన బీఎస్-3 ప్రమాణాల వాహనాల్లోని కొన్ని రబ్బరు భాగాలు, గ్యాస్కెట్లను మార్చాల్సి రావచ్చని రాజ్యసభలో లిఖితపూర్వక సమాధానంలో వెల్లడించారు. సాధారణ సర్వీసింగ్‌లోనే ఈ మార్పులు చేయవచ్చని స్పష్టం చేశారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, డెహ్రాడూన్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం, సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మ్యానుఫ్యాక్చరర్స్, ఆటోమోటివ్ రీసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన అధ్యయనాల్లో కార్లు, ద్విచక్ర వాహనాల ఇంజిన్లలో ఎలాంటి మార్పులు అవసరం లేదని తేలిందని మంత్రి చెప్పారు. ఈ20 పెట్రోల్‌తో పాత వాహనాల పనితీరులో గణనీయమైన మార్పులు లేదా అసాధారణ అరుగుదల కనిపించలేదని వెల్లడించారు. డ్రైవింగ్ సామర్థ్యం, స్టార్ట్ అయ్యే విధానం, లోహ భాగాలు, ప్లాస్టిక్ భాగాల పనితీరు వంటి అంశాల్లో కూడా ఎలాంటి సమస్యలు గుర్తించలేదని గడ్కరీ తెలిపారు. ఈ20 పెట్రోల్ వాడటం వల్ల మైలేజ్ తగ్గుతుందనే అభిప్రాయాన్ని కూడా ఆయన తోసిపుచ్చారు. వాహనం మైలేజ్ అనేది అనేక అంశాలపై ఆధారపడి ఉంటుందని, ఈ20 పెట్రోల్‌ను మాత్రమే కారణంగా చెప్పలేమని ఆటోమొబైల్ తయారీ సంస్థలు, పరీక్షా సంస్థలు స్పష్టం చేసినట్లు వివరించారు.

# భారత పాస్‌పోర్టు నం.81

న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా పాకిస్థాన్ మరోసారి తీవ్ర అప్రతిష్ఠను మూటగట్టుకుంది. ప్రపంచంలోనే అత్యంత బలహీనమైన పాస్‌పోర్ట్‌లు కలిగిన దేశాల జాబితాలో పాకిస్థాన్ నాలుగో స్థానంలో నిలిచింది. లండన్‌కు చెందిన ప్రముఖ సంస్థ 'హెన్లీ అండ్ పార్ట్‌నర్స్' విడుదల చేసిన తాజా హెన్లీ పాస్‌పోర్ట్ ఇండెక్స్ ర్యాంకింగ్స్‌లో ఈ విషయం స్పష్టమైంది. ఈ జాబితాలో పాకిస్థాన్ కంటే కింద ఇరాక్, సిరియా, ఆఫ్ఘనిస్థాన్ మాత్రమే ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల పాస్‌పోర్ట్‌ల ప్రయాణ స్వేచ్ఛను విశ్లేషించి ఈ నివేదికను రూపొందించారు. ఇందులో పాకిస్థాన్ 101వ స్థానంలో నిలిచింది. ఈ ర్యాంకింగ్ ప్రకారం, పాకిస్థాన్ పౌరులు ముందస్తు వీసా లేకుండా లేదా వీసా-ఆన్-అరైవల్ సదుపాయంతో కేవలం 29 దేశాలకు మాత్రమే ప్రయాణించగలరు. ఈ బలహీన ర్యాంకింగ్‌కు తోడు, ఇటీవలి కాలంలో పాకిస్థాన్ పౌరులు అనేక దేశాల నుంచి వీసా తిరస్కరణలను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా గల్ఫ్ దేశాలు పాకిస్థానీయులకు వీసాలు జారీ చేయడంలో కఠిన ఆంక్షలు విధిస్తున్నాయి. గత నవంబర్‌లోనే యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) పాక్ పౌరులకు వీసాలు జారీ చేయడాన్ని నిలిపివేసింది. ఈ విషయాన్ని పాకిస్థాన్ అదనపు అంతర్గత వ్యవహారాల కార్యదర్శి సల్మాన్ చౌదరి సెనేట్ కమిటీ సమావేశంలో స్వయంగా ధ్రువీకరించారు. యూఏఈకి వెళుతున్న పాకిస్థానీయులు నేర కార్యకలాపాల్లో ఎక్కువగా పాలుపంచుకుంటున్నారనే ఆందోళనతోనే ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు సెనేట్ మానవ హక్కుల కమిటీ ఛైర్‌పర్సన్ సమీనా ముంతాజ్ జెహ్రీ వెల్లడించారు. కేవలం యూఏఈ మాత్రమే కాకుండా, సౌదీ అరేబియా సహా పలు గల్ఫ్ దేశాలు 2024 డిసెంబర్‌లో పాకిస్థాన్‌లోని సుమారు 30 నగరాల ప్రజలకు వీసాలపై నిరవధిక నిషేధం విధించాయి.

# ఆరెస్సెస్ గుప్పిట్లో విద్యావ్యవస్థ

**లోక్‌సభలో రాహుల్ ఫైర్**

**విద్యార్థులపై పోలీసుల చర్యకు అమిత్ షా ఆదేశాలు**

**క్షమాపణ చెప్పాలని కేంద్రం డిమాండ్**

న్యూఢిల్లీ: లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు రాజకీయ ప్రకంపనలు సృష్టించాయి. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్)ను లక్ష్యంగా చేసుకుని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ వ్యాఖ్యలపై అధికార పక్షం తీవ్రంగా స్పందించింది. ప్రశ్నపత్రాల లీకేజీ నిరోధక బిల్లుపై బుధవారం జరిగిన చర్చ సందర్భంగా సభలో ఈ వాగ్వాదం చోటుచేసుకుంది. భారత విద్యావ్యవస్థ ఆర్ఎస్ఎస్ గుప్పిట్లోకి వెళ్లిపోయిందని రాహుల్ గాంధీ ఆరోపించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి కేవలం నామమాత్రంగానే ఉన్నారని, తెరవెనుక అసలు వ్యవస్థను నడిపిస్తోంది ఆర్ఎస్ఎస్సేనని ఆయన విమర్శించారు. "ధర్మేంద్ర ప్రధాన్ కేవలం ఒక ప్రతీక మాత్రమే. మన విద్యార్థులకు అసలైన శత్రువు ఆర్ఎస్ఎస్" అని ఆయన వ్యాఖ్యానించారు. విద్యార్థులు జ్ఞానం, సత్యాల దిశగా పయనించకుండా ఆర్ఎస్ఎస్ అడ్డంకులు సృష్టిస్తోందని ఆరోపించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా లక్ష్యంగా కూడా రాహుల్ విమర్శలు గుప్పించారు. నీట్ అవకతవకలకు వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో జూలై 20న విద్యార్థులు చేపట్టిన నిరసనపై జరిగిన పోలీసుల చర్యకు అమిత్ షానే బాధ్యుడని ఆయన ఆరోపించారు. "మన విద్యార్థులపై పెల్లెట్లు ప్రయోగించేందుకు హోంమంత్రే అనుమతి ఇచ్చారు. వారి శరీరాల్లోకి పెల్లెట్లు దిగేలా చేశారు" అని రాహుల్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో పార్లమెంటును ఎదుర్కొనే ధైర్యం హోంమంత్రికి లేదని ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీ చేసిన ఈ ఆరోపణలపై అధికార పక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు స్పందిస్తూ, రాహుల్ గాంధీ నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. తక్షణమే ఆయన తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని, సభకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సైతం రాహుల్ సంయమనం పాటించాలని సూచించారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న వ్యక్తులపై ఆరోపణలు చేసేటప్పుడు కచ్చితమైన ఆధారాలు చూపాలని స్పీకర్ ఓం బిర్లా స్పష్టం చేశారు. ఈ క్రమంలో సభలో తీవ్ర



గందరగోళం నెలకొనడంతో స్పీకర్ సభను కొద్దిసేపు వాయిదా వేశారు.

**బీజేపీ, ఆర్ఎస్ఎస్‌కు క్షమాపణ చెప్పను**

లోక్‌సభలో చేసిన వ్యాఖ్యలపై క్షమాపణ చెప్పేందుకు కాంగ్రెస్ అగ్రనేత, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ నిరాకరించారు. జంతర్‌మంతర్‌లో నిరసన తెలిపిన విద్యార్థులపై పోలీసులు బలప్రయోగం చేయడంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా పాత్ర ఉందన్న ఆరోపణలను మరోసారి పునరుద్ఘాటించారు. "అమిత్ షానే ఆదేశాలు ఇచ్చి ఉండాలి.. లేకపోతే ఏం జరుగుతోందో ఆయనకు తెలియకపోయి ఉండాలి" అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పార్లమెంట్ సమావేశం వాయిదా పడిన తర్వాత కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో రాహుల్ మాట్లాడారు. క్షమాపణ చెబితే ప్రసంగం కొనసాగించేందుకు అవకాశం ఇస్తామని తనకు చెప్పారని, కానీ బీజేపీకి, ఆర్ఎస్ఎస్‌కు తాను ఎప్పటికీ క్షమాపణ చెప్పబోనని స్పష్టం చేశారు. ప్రతిపక్ష నాయకుడిగా దేశానికి సంబంధించిన కీలక అంశాలను లేవనెత్తే హక్కు తనకు ఉందని అన్నారు. నీట్ ప్రశ్నపత్రం లీకేజీకి వ్యతిరేకంగా ఆందోళన చేసిన విద్యార్థులపై పెల్లెట్ గన్స్ వాడారని రాహుల్ ఆరోపించారు. ఒక విద్యార్థి కంటి చూపు కోల్పోయే పరిస్థితి వచ్చిందని, దీనికి సంబంధించిన ఎయిమ్స్ వైద్య నివేదికను తాను చూశానని చెప్పారు. మేకులున్న లాఠీలు, షాక్ బ్యాటన్లతో మహిళలు, మైనర్లపై కూడా దాడులు చేశారని ఆరోపించారు. నిరసన సమయంలో అమిత్ షా పోలీసు అధికారులతో మాట్లాడడం తాను స్వయంగా చూశానని కూడా పేర్కొన్నారు. ఆ తర్వాత జితేంద్ర సింగ్ కు అమిత్ షా నుంచి వరుసగా కాల్స్ వచ్చాయని అన్నారు.

# ఫ్యూయల్ స్విచ్‌లో లోపం లేదు

**ఎయిరిండియా ప్రమాదంపై కేంద్రం ప్రకటన**

న్యూఢిల్లీ: అహ్మదాబాద్‌లో గతేడాది జూన్ 12న కుప్పకూలిన ఎయిరిండియా బోయింగ్ డ్రీమ్‌లైనర్ ప్రమాదంపై దర్యాప్తు కీలక దశకు చేరుకుంది. ఈ ప్రమాదంలో విమానంలోని ప్రయాణికులు, సిబ్బందితో పాటు నేలపై ఉన్నవారూ కలిపి 260 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో ఫ్యూయల్ కంట్రోల్ స్విచ్‌పై అనుమానాలు వ్యక్తమయ్యాయి. అయితే వాటిపై నిర్వహించిన అధునాతన పరీక్షల్లో ఎలాంటి సాంకేతిక లోపం గుర్తించలేదని కేంద్ర ప్రభుత్వం బుధవారం పార్లమెంట్‌కు తెలిపింది. రాజ్యసభలో కేంద్ర పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి మురళీధర్ ఈ వివరాలు వెల్లడించారు. ఫ్యూయల్ కంట్రోల్ స్విచ్‌ను తయారీ సంస్థ వద్ద సమగ్రంగా పరీక్షించగా, లాకింగ్ వ్యవస్థలో అసాధారణంగా ఏమీ కనిపించలేదన్నారు. డీజీసీఏ ఆదేశాల మేరకు విమాన భద్రతా తనిఖీల్లో భాగంగా ఈ పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. అయితే పూర్తి స్థాయి థ్రస్ట్ కంట్రోల్ మాడ్యూల్ పరిశీలన ఇంకా కొనసాగుతోందని మంత్రి తెలిపారు. అమెరికాలోని సియాటిల్‌లో ఉన్న తయారీ కేంద్రంలో ఈ పరీక్షలు జరుగుతున్నాయని చెప్పారు. ఈ పరీక్షల ఫలితాల కోసం దర్యాప్తు అధికారులు ఎదురుచూస్తున్నారని వెల్లడించారు.

# మన్మోహన్ సింగ్‌పై క్రిమినల్ కేసు క్లోజ్

న్యూఢిల్లీ: బొగ్గు గనుల కేటాయింపు వ్యవహారంలో దివంగత మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్‌పై నమోదైన క్రిమినల్ కేసును, ఆనాటి ప్రత్యేక కోర్టు జారీ చేసిన సమన్ల ఉత్తర్వులను సుప్రీంకోర్టు ఈరోజు పూర్తిగా రద్దు చేసింది. విచారణ సంస్థల ఆధారాలను తోసిపుచ్చి స్పెషల్ కోర్టు జారీ చేసిన ఉత్తర్వులను కొట్టివేస్తూ కేసును క్లోజ్ చేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ కీలక తీర్పును వెలువరించింది. ఈ కేసుకు సంబంధించి సీబీఐ దాఖలు చేసిన రెండు విభిన్న క్లోజర్ రిపోర్టుల్లో మన్మోహన్ సింగ్‌కు క్లీన్ చిట్ ఇచ్చిందని, అయినప్పటికీ ట్రయల్ కోర్టు సీబీఐ నివేదికను పక్కనబెట్టి సమన్లు జారీ చేయడంలో ఎలాంటి బలమైన కారణాలు కనిపించడం లేదని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

# యూపీఐతో బుర్జ్ ఖలీఫా టికెట్లు

దుబాయ్: భారతీయ పర్యాటకులకు గుడ్‌న్యూస్. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన భవనం బుర్జ్ ఖలీఫాను సందర్శించేందుకు ఇప్పుడు యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా ఆన్‌లైన్‌లోనే టికెట్లు బుక్ చేసుకోవచ్చు. యూఏఈలో ఈ-కామర్స్ లావాదేవీల కోసం యూపీఐ చెల్లింపులను స్వీకరిస్తున్న తొలి సంస్థగా బుర్జ్ ఖలీఫా నిలిచింది. ఈ సేవలను ఎన్‌పీసీఐ ఇంటర్నేషనల్ పేమెంట్స్ లిమిటెడ్ (ఎన్ఐపీఎల్), నియోపే (బీజుగ్రూప్), ఈమార్ ఎంటర్‌టైన్‌మెంట్ భాగస్వామ్యంతో ప్రారంభించినట్లు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కొత్త సదుపాయంతో భారత పర్యాటకులు యూఏఈకి ప్రయాణానికి ముందే బుర్జ్ ఖలీఫా అధికారిక వెబ్‌సైట్ నుంచి తమకు నచ్చిన యూపీఐ యాప్‌తో సులభంగా టికెట్లు కొనుగోలు చేయవచ్చు.

# ఉద్యమాలు చేయాలనుకుంటే పోలీసులను ఎదుర్కోవాల్సిందే

న్యూఢిల్లీ: రాజ్యసభలో బుధవారం ఢిల్లీ పోలీసుల చర్యలపై అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఢిల్లీలోని సీపీఎం కేంద్ర కార్యాలయంలోకి పోలీసులు వెళ్లి మాజీ జేఎన్‌యూ విద్యార్థి సంఘం అధ్యక్షురాలు ఐషే ఘోష్‌ను అరెస్టు చేసేందుకు ప్రయత్నించిన ఘటనను ప్రతిపక్ష సభ్యులు ప్రస్తావించారు. ఈ సందర్భంగా సభలో ఆందోళన, నినాదాలు కొనసాగాయి. దీనిపై స్పందించిన రాజ్యసభ సభానేత, కేంద్ర మంత్రి జేపీ నడ్డా చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. "ఉద్యమాలు చేయాలనుకునే ఏ విద్యార్థైనా పోలీసులను ఎదుర్కోవాల్సిందే" అని అన్నారు. సీపీఎం సభ్యుడు జాన్ బ్రిట్టాస్ ఈ అంశాన్ని సభ దృష్టికి తీసుకొచ్చారు. జంతర్‌మంతర్‌లో జరిగిన విద్యార్థుల నిరసనలో పాల్గొనడమే ఐషే ఘోష్ చేసిన తప్పని పేర్కొన్నారు. 2020-21 కేసులను చూపిస్తూ పోలీసులు ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండానే జాతీయ రాజకీయ పార్టీ కార్యాలయంలోకి వెళ్లడం ఆందోళన కలిగించే విషయమని అన్నారు. ఈ ఘటనపై కేంద్ర హోంమంత్రి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే కూడా దీన్ని ఖండిస్తూ, పార్టీ కార్యాలయంలోకి వెళ్లి నాయకురాలిని అరెస్టు చేయడానికి ప్రయత్నించడం సిగ్గుచేటని అన్నారు. సంబంధిత పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

# పీఓకే నిరసనకారులు భారత్‌లా శత్రువులే

**పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ తలబిరుసు వ్యాఖ్యలు**

ఇస్లామాబాద్: పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లో కొనసాగుతున్న ఉద్రిక్తతల మధ్య పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ చేసిన వ్యాఖ్యలు మరోసారి తీవ్ర వివాదానికి దారితీశాయి. పీఓకేలో నిరసనలు చేపడుతున్న వారిని భారత్‌తో సమానంగా శత్రువులుగా చూస్తానంటూ నోరు పారేసుకున్నారు. పాకిస్థాన్ భద్రతా బలగాల కాల్పుల్లో గత రెండు రోజుల్లో పీఓకేలో కనీసం 32 మంది కశ్మీరీ నిరసనకారులు ప్రాణాలు కోల్పోయినట్లు వార్తలు వస్తున్న తరుణంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన ఓ వీడియోలో ఖవాజా ఆసిఫ్ మాట్లాడుతూ "అక్కడ నిరసన చేస్తున్న వారిని కూడా భారత్‌ను చూసినట్టే చూస్తాను. వాళ్లు మా శత్రువులే" అని అన్నారు. ఈ వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పీఓకేలో శాంతియుతంగా నిరసనలు చేస్తున్న ప్రజలను శత్రువులుగా చిత్రీకరించడం పరిస్థితిని మరింత ఉద్రిక్తం చేస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# డిజిటల్ అరెస్టు బందిపోటు దోపిడీతో సమానం

**సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు**

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా పెచ్చరిల్లుతున్న 'డిజిటల్ అరెస్టు' మోసాల పట్ల సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అత్యంత అసాధారణ పరిస్థితుల్లో మినహా, ఇటువంటి కేసుల్లో నిందితులకు బెయిల్ మంజూరు చేయరాదని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ మేరకు ట్రయల్ కోర్టులతో పాటు హైకోర్టులకు కీలక ఆదేశాలు జారీ చేసింది. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కి, ముఖ్యంగా సీనియర్ సిటిజన్లు తమ జీవితకాల కష్టార్జితాన్ని కోల్పోతుండటంపై ధర్మాసనం తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. ఈ తరహా మోసాలు బందిపోటు దోపిడీలతో సమానమని సుప్రీంకోర్టు ఘాటుగా వ్యాఖ్యానించింది. అందువల్ల డిజిటల్ అరెస్టు కేసులను సాధారణ నేరాలుగా పరిగణించకుండా, 'వ్యవస్థీకృత నేరాల నియంత్రణ చట్టం' కింద దర్యాప్తు జరపాలని పోలీసు యంత్రాంగాన్ని ఆదేశించింది. ఇలాంటి తీవ్రమైన నేరాల్లో దర్యాప్తు సరళి కూడా అదే స్థాయిలో పకడ్బందీగా ఉండాలని అభిప్రాయపడింది. ప్రధాన నిందితుడికి బ్యాంకు ఖాతా తెరిచేందుకు కేవలం సహకరించాను తప్ప, తనకు నేరంతో ప్రత్యక్ష ప్రమేయం లేదని పేర్కొంటూ ఓ వ్యక్తి బెయిల్ కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించాడు.

లయ్యారి చిత్రం




## నీ వయసులో నాకు 2 జాతీయ పురస్కారాలు వచ్చాయి

### కాక్రోచ్ పార్టీ ప్రతినిధిపై కంగన ఘాటు విమర్శలు



బీజేపీ ఎంపీ, సినీనటి కంగనా రనౌత్ మరోసారి 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ)పై తీవ్ర విమర్శలు చేశారు. ఈసారి ఆ పార్టీ అధికార ప్రతినిధి సౌరవ్ దాస్‌ను లక్ష్యంగా చేసుకున్నారు. ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో ఆయనపై విమర్శల వర్షం కురిపించారు. సౌరవ్ దాస్ తనను తాను విద్యార్థిగా చెప్పుకోవడాన్ని ప్రశ్నిస్తూ.. ఆయనకు ఎలాంటి నైపుణ్యం లేదని వ్యాఖ్యానించారు. అదే సమయంలో తన రాజకీయ, సినీ ప్రయాణాన్ని ప్రస్తావిస్తూ తాను సాధించిన విజయాలను గుర్తు చేశారు. ఏఎన్ఐ ఇంటర్వ్యూకు సంబంధించిన సౌరవ్ దాస్ స్క్రీన్‌షాట్‌ను పంచుకున్న కంగనా "గూగుల్‌లో వెతికితే ఆయన వయసు 28 ఏళ్లని తెలిసింది. ఆ వయసులో కూడా తనను విద్యార్థిగా ఎలా చెప్పుకుంటున్నారో అర్థం కావడం లేదు. నేను రెండేళ్లుగా రాజకీయాల్లో ఉన్నా, 20 ఏళ్లుగా ప్రజాజీవితంలోనే ఉన్నాను. ఆయన వయసులోనే నాకు రెండు జాతీయ పురస్కారాలు వచ్చాయి. ప్రస్తుతం ఎంపీగా బాధ్యతలు నిర్వర్తిస్తూనే దర్శకురాలు, నటి, నిర్మాత, కథా రచయిత్రి, పారిశ్రామికవేత్తగా కూడా పని చేస్తున్నాను" అని పేర్కొన్నారు. అంతటితో ఆగని కంగనా.. సౌరవ్ దాస్‌పై మరింత ఘాటుగా స్పందించారు. "నీలాంటి పూర్తిగా పనిలేని, నిరుద్యోగ వ్యక్తికి విజయవంతమైన జీవితం అంటే ఏంటో అర్థం కాదు. నీ సమస్యలు వ్యక్తిగతమైనవి. నువ్వు విద్యార్థివి కాదు. పూర్తిగా పనిలేనివాడివి. ముందుగా ఏదైనా నైపుణ్యం నేర్చుకోవడం ప్రారంభించు. అదే నీకు మంచి ఆరంభం అవుతుంది" అని వ్యాఖ్యానించారు. నీట్-యూజీ 2026 ప్రశ్నాపత్రం లీక్ ఆరోపణలపై సీజేపీ చేపట్టిన ఆందోళన ఇటీవల కేంద్ర మాజీ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో ముగిసింది. బాధిత కుటుంబాలకు పరిహారం, నిరసనకారులపై నమోదైన ఎఫ్ఐఆర్‌ల ఉపసంహరణ వంటి పలు డిమాండ్లను కేంద్రం అంగీకరించిన తర్వాత నెలరోజులుగా కొనసాగిన ఉద్యమాన్ని సీజేపీ విరమించింది. ఈ ఉద్యమంపై కంగనా గతంలో కూడా విమర్శలు చేశారు. నిరసనల తీరును తప్పుబట్టడమే కాకుండా, ఉద్యమంలో పాల్గొన్న యువతపై కూడా వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు.



## అభిమానికి ట్యూమర్.. వరుణ్ తేజ్ అండ

ప్రముఖ సినీ నటుడు వరుణ్ తేజ్ తన ఉదారతను మరోసారి చాటుకున్నారు. ట్యూమర్‌తో బాధపడుతున్న అనంతపురం జిల్లాకు చెందిన ఓ అభిమానికి అండగా నిలిచి, తన మానవత్వాన్ని ప్రదర్శించారు. బాధితుడిని హైదరాబాద్‌లోని ఒక ప్రముఖ ఆసుపత్రిలో చేర్పించడమే కాకుండా, చికిత్సకు అయ్యే పూర్తి వ్యయాన్ని తానే స్వయంగా భరించి భరోసానిచ్చారు. అనంతపురం జిల్లా చిరంజీవి యువత అధ్యక్షుడు, గుత్తి పట్టణ జనసేన పార్టీ అధ్యక్షుడు సురేష్ పాటిల్ కొంతకాలంగా ట్యూమర్ సమస్యతో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న వరుణ్ తేజ్ తక్షణమే స్పందించారు. తన తల్లి పద్మజ సహకారంతో సురేష్‌ను హైదరాబాద్‌లోని సిటీ న్యూరో సెంటర్‌కు తరలించి, మెరుగైన వైద్యం అందేలా అక్కడి వైద్యులతో మాట్లాడి అన్ని ఏర్పాట్లు చేశారు. వైద్యుల ప్రత్యేక పర్యవేక్షణలో సురేష్ పాటిల్‌కు శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తయింది. చికిత్స సమయంలో బాధితుడి కుటుంబానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆసుపత్రిలో అవసరమైన అన్ని సౌకర్యాలను వరుణ్ తేజ్ కల్పించారు. సురేష్ పూర్తిగా కోలుకుని డిశ్చార్జ్ అయ్యే వరకు ఆయన ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అండగా నిలిచారు.

## సినిమాగా 'శ్రీమద్ భాగవతం'

ప్రముఖ పౌరాణిక ధారావాహిక 'రామాయణం' సృష్టికర్త రామానంద సాగర్ కుటుంబానికి చెందిన సంస్థ నుంచి మరో భారీ ప్రాజెక్ట్ సిద్ధమవుతోంది. గురుపౌర్ణమి (వ్యాస పౌర్ణమి) పర్వదినాన్ని పురస్కరించుకుని, సాగర్ పిక్చర్స్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ 'శ్రీమద్ భాగవతం' పేరుతో ఏడు భాగాల సినిమాటిక్ ఫ్రాంచైజీని ప్రకటించింది. భాగవత మహాపురాణం ఆధారంగా, అత్యంత ప్రామాణిక కథనంతో ఈ చిత్రాలను థియేటర్లలో విడుదల చేయనున్నట్లు వెల్లడించింది. శతాబ్దాలుగా కొనసాగుతున్న ఏడు రోజుల భాగవత సప్తాహ పారాయణం సంప్రదాయం స్ఫూర్తితో ఈ చిత్రాలను ఏడు భాగాలుగా తీర్చిదిద్దుతున్నారు. దీనికి 'సప్త' అని నామకరణం చేశారు. ఈ ఫ్రాంచైజీలోని ఏడు భాగాలు ఒకదానికొకటి అనుసంధానమై సాగనున్నాయి. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన నటీనటులు, దర్శకుడు మరియు ఇతర సాంకేతిక నిపుణుల వివరాలను చిత్రబృందం త్వరలోనే అధికారికంగా ప్రకటించనుంది.




## వెంకటేశ్ కూతురిగా యువినా పార్థవి



విక్టరీ వెంకటేశ్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో వస్తున్న చిత్రం 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం. 47' (ఏకే 47). తాజాగా ఈ చిత్రం నుంచి మరో ఆసక్తికరమైన అప్‌డేట్ వచ్చింది. చిత్ర యూనిట్ తాజాగా ఈ సినిమాలోని మరో ముఖ్య పాత్రను పరిచయం చేస్తూ ఒక చిన్న వీడియో గ్లింప్స్‌ను విడుదల చేసింది. ఇందులో వెంకటేష్ కూతురు 'సంపూర్ణ" పాత్రలో నటి యువినా పార్థవిని ప్రేక్షకులకు పరిచయం చేశారు. ఈ కొత్త గ్లింప్స్‌లో, చిట్టిబాబు పాత్రలో ఉన్న వెంకటేశ్, రఘుబాబుతో ఇంటి విషయాల గురించి మాట్లాడుతుండగా, వారి కూతురు సంపూర్ణ (యువినా పార్థవి) ఎంతో ఉత్సాహంగా పరిగెత్తుకుంటూ వస్తుంది. "నాన్నా.. నేను ప్రేమలో పడ్డాను" అని తండ్రితో చెబుతుంది. దానికి చిట్టిబాబు చిరాకు పడుతూ, "ఈసారి కార్ డ్రైవర్‌తోనా, మెకానిక్‌తోనా?" అని అడగటంతో ఈ వీడియోలో చూడొచ్చు. తండ్రీకూతుళ్ల మధ్య సాగే ఈ ఫన్నీ సంభాషణ, సినిమా ఫ్యామిలీ కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఉండబోతోందన్న సంకేతాలను ఇస్తోంది. ఈ గ్లింప్స్‌కు సోషల్ మీడియాలో మంచి స్పందన లభిస్తోంది. చిత్రబృందం వినూత్నంగా ప్రమోషన్లు నిర్వహిస్తోంది. ఇప్పటికే వెంకటేశ్ ను చిట్టిబాబుగా, ఆయన భార్య స్వర్ణ పాత్రలో శ్రీనిధి శెట్టిని పరిచయం చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు కూతురి పాత్రను కూడా పరిచయం చేయడంతో సినిమాపై అంచనాలు మరింత పెరుగుతున్నాయి. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ (చినబాబు) ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

## జీ5.. 7 భాషల్లో భారీ కంటెంట్ లైనప్




ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ జీ5 సంచలన ప్రకటన చేసింది. తెలుగు, హిందీ, తమిళం సహా మొత్తం 7 భాషల్లో సినిమాలు, వెబ్ సిరీస్‌లతో కూడిన భారీ కంటెంట్ లైనప్‌ను ప్రకటించి ప్రేక్షకులలో ఆసక్తిని పెంచింది. ముఖ్యంగా తెలుగు ఆడియెన్స్‌ను ఆకట్టుకునేలా పలు క్రేజీ ప్రాజెక్టులను తమ జాబితాలో చేర్చింది. విషయానికి వస్తే, బాలకృష్ణ నటిస్తున్న ఎన్బీకే111, అనిల్ రావిపూడి దర్శకత్వంలో వెంకటేశ్ హీరోగా వస్తున్న వెంకీ5, మోహన్‌లాల్ నటిస్తున్న వృషకర్మ వంటి భారీ చిత్రాల థియేట్రికల్ విడుదల తర్వాత తమ ప్లాట్‌ఫామ్‌లో స్ట్రీమింగ్ కానున్నట్లు జీ5 వెల్లడించింది. వీటితో పాటు నివేదా థామస్ ప్రధాన పాత్రలో 'శ్రీమతి', శ్రీకాంత్ కీలక పాత్రలో 'అబ్జెక్షన్ మై లార్డ్' అనే కొత్త ఒరిజినల్స్‌ను కూడా తీసుకురానుంది. ఈ భారీ లైనప్ కోసం జీ5 దేశంలోని పలు అగ్ర నిర్మాణ సంస్థలతో చేతులు కలిపింది. తెలుగులో అన్నపూర్ణ స్టూడియోస్, శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ వంటి సంస్థలతో భాగస్వామ్యం కుదుర్చుకుంది.


## 75 కోట్లకు రామాయణ ఆడియో హక్కులు

బాలీవుడ్ స్టార్ దర్శకుడు నితేష్ తివారీ తెరకెక్కిస్తున్న భారీ పౌరాణిక చిత్రం 'రామాయణ'పై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రంలో రణబీర్ కపూర్ శ్రీరాముడి పాత్రలో, సాయి పల్లవి సీత పాత్రలో, యశ్ రావణాసురుడి పాత్రలో నటిస్తున్నారు. అలాగే హనుమంతుడి పాత్రలో సన్నీ డియోల్, లక్ష్మణుడి పాత్రలో రవి దూబే కనిపించనున్నారు. రెండు భాగాలుగా రూపొందుతున్న ఈ చిత్రం తొలి భాగం 2026 దీపావళి సందర్భంగా విడుదల కానుండగా, రెండో భాగాన్ని 2027 దీపావళికి ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక చిత్రానికి సంగీత దిగ్గజాలు ఎ.ఆర్. రెహమాన్, హాన్స్ జిమ్మర్ సంగీతం అందిస్తున్నారు. ఇదిలా ఉంటే తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఓ క్రేజీ వార్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

## మేనమామే బలవంతం చేశాడు



బుల్లితెర నటి, 'బాలికా వధు 2' సీరియల్ ఫేం శివాంగి జోషి చిన్నప్పుడు తనకు ఎదురైన లైంగిక వేధింపుల గురించి వివరిస్తూ ఎమోషనల్ అయింది. తాజాగా 'లాకప్ 2' రియాల్టీ షోలో పాల్గొన్న ఆమె.. చిన్నప్పుడు సొంత మేనమామనే తనతో అసభ్యంగా ప్రవర్తించారని తెలిపారు. 'మా అమ్మకు సోదరుడైన ఓ వ్యక్తిని నేను చాలా నమ్మేదాన్ని. ముద్దుగా మామాజీ అని పిలిచేదాన్ని. నన్ను రోజు స్కూల్ నుంచి తీసుకొచ్చేవాడు. మా అమ్మ అతన్ని ఎంతగానో నమ్మేది. అదే ఆసరాగా చేసుకొని నాతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. నేను సినిమాల్లోకి వెళ్లాలంటే ముందుగా డ్రైవింగ్ నేర్చుకోవాలని చెబుతూ..ఒళ్లో కూర్చోబెట్టుకొని ఏదోదో చెప్పేవాడు. ఆయన ఏం చెబుతున్నాడో.. ఆయన ఉద్దేశాలు ఏంటో అర్థం కాలేదు. కానీ నాకు నచ్చలేదు. నేను డ్రైవింగ్ నేర్చుకోనని చెప్పి.. పక్కకు వచ్చేశా. ఓ రోజు మా అమ్మనాన్నలు బయటకు వెళ్లారని తెలుసుకొని.. ఇంట్లోకి వచ్చాడు. హీరోయిన్‌వి కావాలంటే రకరకాల సీన్లలో నటించాలంటూ.. నా నుదుటిపై, చెంపలపై ముద్దు పెట్టాడు. నా పెదాలపై ముద్దు పెట్టేందుకు ప్రయత్నించగా..తోసేశాను. దీంతో అతనికి కోపం వచ్చి నన్ను కింద పడేశాడు. అదృష్టంకొద్దీ అప్పుడే అమ్మనాన్నలు ఇంట్లోకి వచ్చారు. నా అరుపులు విని గదిలోకి వచ్చి చూశారు. ఏం జరిగిందో తెలుసకొని..అతన్ని కొట్టి ఇంటి నుంచి బయటకు గెంటేశారు' అని చెబుతూ శివాంగీ ఎమోషనల్ అయింది.




# గిల్ నంబర్ వన్

**వన్డే, టీ20 ర్యాంకింగ్స్ జాబితాను ఐసీసీ తాజాగా విడుదల చేసింది. భారత టెస్టు, వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ప్రపంచ నంబర్ 1 బ్యాటర్‌గా అవతరించాడు. ఇటీవల ఇంగ్లండ్‌తో జరిగిన మూడు వన్డేల సిరీస్‌లో అద్భుత ప్రదర్శన చేసిన గిల్(801).. న్యూజిలాండ్ బ్యాటర్ డారిల్ మిచెల్(794)ను వెనక్కి నెట్టి అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నాడు.**

మూడు, నాలుగు స్థానాల్లో భారత వెటరన్ ప్లేయర్లు విరాట్ కోహ్లీ(767), రోహిత్ శర్మ(758) కొనసాగుతున్నారు. భారత యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ టీ20 ర్యాంకింగ్స్ జాబితాలో అదరగొట్టాడు. ఇంగ్లండ్‌తో సిరీస్‌తో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన ఈ సిక్సర్ల పిడుగు.. జింబాబ్వేపై వరుసగా రెండు హాఫ్ సెంచరీలు చేసి చరిత్ర సృష్టించిన సంగతి తెలిసిందే. దీంతో టీ20 ర్యాంకింగ్స్ జాబితాలో ఏకంగా 230 స్థానాలు ఎగబాకి అందరినీ ఆశ్చర్యపరిచాడు. జింబాబ్వేతో సిరీస్‌లో మొత్తం 151 పరుగులు చేసిన ఈ 15 ఏళ్ల కుర్రాడు.. 278వ స్థానం నుంచి నేరుగా 48వ స్థానానికి దూసుకొచ్చాడు. టీ20 బ్యాటర్ల జాబితాలో ఇషాన్ కిషన్ 910 రేటింగ్ పాయింట్లతో నంబర్-1 స్థానాన్ని నిలబెట్టుకోగా, పాకిస్థాన్ బ్యాటర్ సాహిబ్‌జాదా ఫర్హాన్ రెండో స్థానానికి ఎగబాకాడు. జింబాబ్వే పర్యటనలో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయిన అభిషేక్ శర్మ మూడో స్థానానికి పడిపోయాడు. జింబాబ్వే సిరీస్‌లో మూడు మ్యాచ్‌ల్లోనూ అజేయంగా నిలిచిన తిలక్ వర్మ(750) ఆరో స్థానానికి చేరుకున్నాడు. వన్డే బౌలింగ్ జాబితాలో ఎలాంటి మార్పులు చోటు చేసుకోలేదు. అఫ్గానిస్థాన్ బౌలర్ రషీద్ ఖాన్ అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నాడు. టాప్ 15 జాబితాలో భారత బౌలర్లలో కేవలం కుల్‌దీప్ యాదవ్ చోటు దక్కించుకోవడం గమనార్హం. 596 పాయింట్లతో 11వ స్థానంలో కొనసాగుతున్నాడు. ఇక టీ20 బౌలింగ్ జాబితాలో.. గాయంతో జింబాబ్వే సిరీస్‌కు దూరమైన స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి ఎనిమిదో స్థానానికి పడిపోయాడు. ఇదిలా ఉంటే, జింబాబ్వేపై సిరీస్ విజయం సాధించిన భారత్ వన్డే, టీ20ల్లో ప్రపంచ నంబర్-1 జట్టుగా తన స్థానాన్ని నిలబెట్టుకుంది. టీ20ల్లో భారత్, ఇంగ్లండ్ జట్లు తలో 268 రేటింగ్ పాయింట్లతో సమానంగా ఉన్నాయి.



# ఆర్సీబీ అంటే బ్రాండ్ అక్కడ!

**ఐపీఎల్‌లో అత్యంత విలువైన టీమ్ ఇదే**

**బెంగళూరు బ్రాండ్ విలువ 2,987 కోట్లు**

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ప్రపంచంలోనే అత్యంత విలువైన క్రీడా లీగ్‌లలో ఒకటిగా మరింత బలపడింది. హౌలిహాన్ లోకే విడుదల చేసిన 2026 ఐపీఎల్ బ్రాండ్ వాల్యుయేషన్ స్టడీ ప్రకారం లీగ్ మొత్తం వ్యాపార విలువ రూ.1,97,024.68 కోట్లకు చేరింది. గత ఏడాదితో పోలిస్తే ఇది 11.4 శాతం పెరిగింది. లీగ్ బ్రాండ్ విలువ కూడా రూ.41,106 కోట్లకు చేరి 10.3 శాతం వృద్ధి నమోదు చేసింది. బ్రాండ్ విలువలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) సుమారు రూ.2,987 కోట్లతో అగ్రస్థానంలో నిలిచింది. రూ.3 వేల కోట్ల మార్కుకు చేరువైన తొలి క్రికెట్ ఫ్రాంచైజీగా చరిత్ర సృష్టించింది. ముంబై ఇండియన్స్ దాదాపు రూ.2,528 కోట్లతో రెండో స్థానంలో నిలవగా, కోల్‌కతా నైట్‌రైడర్స్ సుమారు రూ.2,346 కోట్లతో మూడో స్థానం దక్కించుకుంది. చెన్నై సూపర్ కింగ్స్ రూ.2,336 కోట్లతో నాలుగో స్థానానికి పరిమితమైంది. మిగిలిన జట్లలో సన్‌రైజర్స్ హైదరాబాద్ సుమారు రూ.1,608 కోట్లతో ఐదో స్థానంలో నిలిచింది. రాజస్థాన్ రాయల్స్ దాదాపు రూ.1,541 కోట్లతో ఆరో స్థానం దక్కించుకుంది. పంజాబ్ కింగ్స్ రూ.1,513 కోట్లతో ఏడు, గుజరాత్ టైటాన్స్ సుమారు రూ.1,503 కోట్లతో ఎనిమిదో స్థానాల్లో నిలిచాయి. ఢిల్లీ క్యాపిటల్స్ దాదాపు రూ.1,494 కోట్లతో తొమ్మిది, లక్నో సూపర్ జెయింట్స్ సుమారు రూ.1,168 కోట్లతో పదో స్థానంలో నిలిచాయి. 2026లో ఫ్రాంచైజీల యాజమాన్యంలోనూ కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. బ్లాక్‌స్టోన్, బోల్ట్ వెంచర్స్, ఆదిత్య బిర్లా గ్రూప్, టైమ్స్ ఆఫ్ ఇండియా గ్రూప్‌తో కూడిన కన్సార్టియం ఆర్సీబీని సుమారు రూ.17,042 కోట్ల విలువకు కొనుగోలు చేసింది. మరోవైపు మిట్టల్ కుటుంబం, అదర్ పూనావాలా కలిసి రాజస్థాన్ రాయల్స్‌ను సుమారు రూ.15,797 కోట్ల విలువతో సొంతం చేసుకున్నారు. ఐపీఎల్‌కు ప్రపంచ పెట్టుబడిదారుల నుంచి లభిస్తున్న ఆదరణకు ఈ ఒప్పందాలు నిదర్శనమని నివేదిక పేర్కొంది.

# ఫుట్‌బాల్‌కు నేమార్ వీడ్కోలు

**బ్రెజిల్ ఫుట్‌బాల్ దిగ్గజం, ఆ జట్టు ఆల్-టైమ్ టాప్ స్కోరర్ అయిన నేమార్ జూనియర్ తన అంతర్జాతీయ కెరీర్‌కు ముగింపు పలికాడు. 34 ఏళ్ల నేమార్.. 16 ఏళ్లకు పైగా సాగిన తన జాతీయ జట్టు ప్రస్థానానికి వీడ్కోలు పలుకుతున్నట్లు అధికారికంగా ప్రకటించాడు. 2026 ఫిఫా ప్రపంచకప్ తర్వాత తన భవిష్యత్తుపై నెలకొన్న ఊహాగానాలకు తెరదించుతూ ఈ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. కోపా సుడాఅమెరికానా టోర్నమెంట్‌లో భాగంగా తన క్లబ్ శాంటోస్ తరఫున ఆడిన మ్యాచ్ అనంతరం నేమార్ ఈ విషయాన్ని ధ్రువీకరించాడు. వెనిజులాకు చెందిన యూనివర్సిడాడ్ సెంట్రల్‌పై శాంటోస్ 4-2 తేడాతో విజయం సాధించిన తర్వాత అతడు మీడియాతో మాట్లాడాడు.**



2026 ప్రపంచకప్‌లో రౌండ్ ఆఫ్ 16లో నార్వే చేతిలో ఓటమి పాలైన మ్యాచే బ్రెజిల్ తరఫున తనకు చివరిదని స్పష్టం చేశాడు. జాతీయ జట్టుతో తన ప్రయాణం ముగిసిందని, ఎలాంటి పశ్చాత్తాపం లేకుండా వైదొలగుతున్నానని తెలిపాడు. "జాతీయ జట్టుతో నా ప్రయాణం ముగిసింది. నేను చరిత్ర సృష్టించాను, ఎంతో సంతోషంగా ఉన్నాను. నా రక్తాన్ని, నా జీవితాన్ని ఇచ్చాను. పసుపు జెర్సీ కోసం ఎల్లప్పుడూ పోరాడాను. కానీ, ఇకపై నేను జాతీయ జట్టుకు ఆడాలనుకోవడం లేదు" అని నేమార్ భావోద్వేగంగా వ్యాఖ్యానించాడు. ఈ ప్రకటనతో బ్రెజిల్ ఫుట్‌బాల్‌లో ఒక శకం ముగిసినట్లయింది. నేమార్ పలు ఫిఫా ప్రపంచకప్‌లు, కోపా అమెరికా టోర్నమెంట్లు, ఒలింపిక్స్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించాడు. ఇదే సమయంలో ఇటీవలి క్లబ్ మ్యాచ్ తర్వాత డ్రెస్సింగ్ రూమ్‌లో యువ సహచర ఆటగాళ్లను విమర్శించి, భయపెట్టారని వచ్చిన వార్తలను నేమార్ ఖండించాడు. "ఇలాంటి వార్తలు బాధను, విసుగును కలిగిస్తాయి. మ్యాచ్ తర్వాత నేను మాట్లాడాను. ఇంకా మెరుగ్గా ఆడాలని డిమాండ్ చేశాను. జట్టు కెప్టెన్‌గా ఆ మాత్రం చెప్పే హక్కు నాకు ఉంది" అని స్పష్టం చేశాడు. అంతర్జాతీయ ఫుట్‌బాల్ నుంచి తప్పుకున్నప్పటికీ, నేమార్ తన క్లబ్ కెరీర్‌ను శాంటోస్‌తో కొనసాగించనున్నాడు. కోపా సుడాఅమెరికానాలో తాజా విజయంతో శాంటోస్ జట్టు రౌండ్ ఆఫ్ 16కు అర్హత సాధించింది. తదుపరి రౌండ్‌లో ఈక్వెడార్‌కు చెందిన మకారా జట్టుతో తలపడనుంది.

# దులీప్ ట్రోఫీ: వైభవ్‌కు వైస్ కెప్టెన్సీ



దేశవాళీ ప్రతిష్ఠాత్మక టోర్నీ దులీప్ ట్రోఫీ 2026 కోసం ఈస్ట్ జోన్ తమ 15 మంది సభ్యులతో కూడిన జట్టును బుధవారం ప్రకటించింది. భారత వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్‌కు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించగా, 15 ఏళ్ల యువ బ్యాటింగ్ సంచలనం వైభవ్ సూర్యవంశీకి వైస్ కెప్టెన్ పదవిని కట్టబెట్టడం విశేషం. ఈ టోర్నమెంట్ ఆగస్టు 23న బెంగళూరులో ప్రారంభం కానుంది. ఇటీవల జింబాబ్వేతో జరిగిన సిరీస్‌లో ఇషాన్ కిషన్ అద్భుత ఫామ్‌లో కనిపించాడు. అతడి దూకుడైన ఆటతీరు, నాయకత్వ అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుని సెలక్టర్లు ఈ కీలక బాధ్యతను అప్పగించారు. మరోవైపు, అందరి దృష్టి ఇప్పుడు 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీపైనే ఉంది. బీహార్ నుంచి భారత జాతీయ జట్టులో స్థానం సంపాదించిన వైభవ్, ఇటీవల అంతర్జాతీయ స్థాయిలో రాణించిన సంగతి తెలిసిందే. తన నిలకడైన ప్రదర్శనతో ఆకట్టుకున్న అతడికి, ఇంత చిన్న వయసులోనే దేశవాళీ క్రికెట్లో వైస్ కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించడం గమనార్హం. ఈ జట్టులో అనుభవానికి, యువతకు సమాన ప్రాధాన్యతనిచ్చారు. సీనియర్ పేసర్ మహమ్మద్ షమీ దేశవాళీ క్రికెట్‌లోకి పునరాగమనం చేయడం బౌలింగ్ విభాగాన్ని బలోపేతం చేయనుంది. అతడికి ముఖేష్ కుమార్ తోడుగా ఉండనున్నాడు. అభిమన్యు ఈశ్వరన్, షాబాజ్ అహ్మద్, అనుకుల్ రాయ్ వంటి ఆల్‌రౌండర్లతో జట్టు సమతూకంగా, పటిష్ఠంగా కనిపిస్తోంది.

**ఈస్ట్ జోన్ జట్టు:** ఇషాన్ కిషన్ (కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ (వైస్ కెప్టెన్), అభిమన్యు ఈశ్వరన్, సుదీప్ కుమార్ ఘరామి, షాబాజ్ అహ్మద్, సూరజ్ సింధు జైస్వాల్, మహమ్మద్ షమీ, ముఖేష్ కుమార్, కుమార్ కుషాగ్రా, శిఖర్ మోహన్, అనుకుల్ రాయ్, విరాట్ సింగ్, సుభాన్షు సేనాపతి, దేనిష్ దాస్, అభిజిత్ సర్కార్.

**స్టాండ్ బై:** ఆయుష్ లోహరుక, శ్రీదామ్ పాల్, సంబిత్ ఎస్. బరల్, శరణ్‌దీప్ సింగ్, స్వస్తిక్ సమల్.

# టీమిండియా ఫీల్డింగ్ కోచ్‌గా శుభదీప్!



ఐర్లాండ్, ఇంగ్లాండ్ చేతుల్లో అత్యంత దారుణంగా ఓటమిపాలైంది ఇండియా. ఈ క్రమంలో భారత జట్టులో సమూల మార్పులు చేసేందుకు రంగం సిద్ధం చేసింది. ఇందులో భాగంగానే భారత జట్టు కొత్త ఫీల్డింగ్ కోచ్ గా శుభదీప్ ఘోష్ ఎంపికైనట్లు జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. ప్రస్తుత కోచ్ దిలీప్ పదవీకాలం ముగిసింది. ఈ క్రమంలో అతనిని శ్రీలంక టూర్ కు దూరం పెట్టారు. అతడి స్థానంలో ఘోష్ ను బీసీసీఐ సెలెక్ట్ చేసినట్లు వార్తలు వస్తున్నాయి. దీంతో గురించి సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. భారత జట్టు తరుపున అండర్ 19 క్రికెట్ ఆడాడు శుభదీప్ ఘోష్. అలాగే ఐపీఎల్ లో కేకేఆర్, ఢిల్లీ క్యాపిటల్స్ ఫ్రాంచైజీలకు కూడా పనిచేశాడు. దశాబ్దానికి పైగా నేషనల్ క్రికెట్ అకాడమీలో వివిధ జట్లకు ట్రైనింగ్ ఇస్తున్నాడు.

## రాజీనామాలు కావు..

# కాంట్రాక్టు పూర్తి: బీసీసీఐ

శ్రీలంకతో జరగనున్న కీలక టెస్టు సిరీస్‌కు ముందు భారత క్రికెట్ జట్టు సహాయక సిబ్బందిలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. అసిస్టెంట్ కోచ్ ర్యాన్ టెన్ డెస్కాటే, ఫీల్డింగ్ కోచ్ టి. దిలీప్‌ల కాంట్రాక్టులను పొడిగించకూడదని భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) నిర్ణయించింది. వీరిద్దరి నిష్క్రమణతో టీమిండియా నూతన ఫీల్డింగ్ కోచ్‌తో శ్రీలంక పర్యటనకు వెళ్లనుంది. ఈ పరిణామాలపై బీసీసీఐ కార్యదర్శి దేవాజిత్ సైకియా స్పందిస్తూ, టెన్ డెస్కాటే, దిలీప్‌ల కాంట్రాక్టు గడువు జూన్‌తోనే ముగిసిందని తెలిపారు. వారిని తొలగించారని లేదా వారు రాజీనామా చేశారని వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని, కేవలం ఒప్పంద గడువు ముగియడం వల్లే వారు తప్పుకున్నారని స్పష్టం చేశారు. కొత్త ఫీల్డింగ్ కోచ్ పదవి కోసం ఇద్దరు, ముగ్గురి పేర్లను పరిశీలిస్తున్నామని, ఒకటి రెండు రోజుల్లో తుది నిర్ణయం తీసుకుంటామని ఆయన వివరించారు. గౌతమ్ గంభీర్ ప్రధాన కోచ్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం టెన్ డెస్కాటే జట్టుతో కలిశాడు. భారత్ విజేతగా నిలిచిన టీ20 ప్రపంచకప్‌తో పాటు ఛాంపియన్స్ ట్రోఫీ వంటి టోర్నీలలో అతడు జట్టుకు సేవలందించాడు. ప్రస్తుతం డెస్కాటే ఐపీఎల్ ఫ్రాంచైజీ కోల్‌కతా నైట్ రైడర్స్‌లో కీలక బాధ్యతలు చేపట్టనున్నాడు.




# కామన్వెల్త్‌లో గుల్వీర్ సింగ్ చరిత్ర

పరుగు పందెంలో గెలవాలంటే అద్భుతాలు చేయక్కర్లేదు. కేవలం ఓపిక పట్టి, సరైన సమయం కోసం వేచి చూస్తే చాలు. ఈ ఒక్క చిన్న సూచనే... భారత లాంగ్ డిస్టెన్స్ రన్నర్ గుల్వీర్ సింగ్‌ను చరిత్ర సృష్టించేలా చేసింది. గ్లాస్గో వేదికగా జరిగిన కామన్వెల్త్ గేమ్స్‌లో 10,000 మీటర్ల పరుగు పందెంలో చారిత్రక రజత పతకాన్ని ముద్దాడేలా నడిపించింది. రేసు ప్రారంభానికి ముందు కోచ్ స్కాట్ సిమన్స్ చెప్పిన మాటలు గుల్వీర్ మదిలో బలంగా నాటుకుపోయాయి. "ప్రత్యేకంగా ఏమీ చేయొద్దు. ముందున్న వారిని అనుసరించు. చివరి 400 మీటర్లు మిగిలి ఉన్నప్పుడు నీ సర్వశక్తులు ఒడ్డు' అని నా కోచ్ చెప్పారు. రేసులో ప్రతి అడుగు ఆయన వ్యూహం ప్రకారమే వేశాను. చివరి దశలో వేగాన్ని బట్టే పతకం నిర్ణయమవుతుందని ఆయన ముందే చెప్పారు. అందుకే గ్రూప్‌తోనే ఉండి, ఆఖర్లో నా ప్రతాపం చూపించాను" అంటూ గుల్వీర్ తన గెలుపు రహస్యాన్ని పంచుకున్నాడు. గ్లాస్గోలోని స్కాట్స్‌టౌన్ స్టేడియంలో జరిగిన ఈ రేసు గుల్వీర్ ఓపికకు, క్రమశిక్షణకు అసలైన పరీక్ష పెట్టింది. ఆఫ్రికన్ దిగ్గజాలు, ప్రపంచ ఛాంపియన్‌షిప్ రజత పతక విజేత డేనియల్ ఎబెన్యో వంటి మేటి అథ్లెట్లతో కూడిన పోటీలో, గుల్వీర్ ఎలాంటి తొందరపాటు ప్రదర్శించలేదు. రేసు మధ్యలో వేగం హెచ్చుతగ్గులకు లోనైనప్పుడు, అతడు తొమ్మిదో స్థానానికి పడిపోయినా, ప్రణాళికను వీడలేదు. నిదానంగా పుంజుకుంటూ, చివరి ల్యాప్‌ల వరకు అగ్రశ్రేణి అథ్లెట్లకు చేరువగానే కొనసాగాడు. చివరి 200 మీటర్ల దూరంలో ఉన్నప్పుడు, తనలోని అపారమైన శక్తిని బయటకు తీశాడు. ఐల్ ఆఫ్ మ్యాన్ రన్నర్‌ను దాటి ముందుకు దూసుకెళ్లి, ఆస్ట్రేలియా రన్నర్ కై రాబిన్సన్ (27:48.93) తర్వాత రెండో స్థానంలో నిలిచాడు. గుల్వీర్ 27:49.8 సమయంతో రేసును పూర్తి చేసి, రజత పతకాన్ని ఖాయం చేసుకున్నాడు.

నేటి ఈవార్తలు సంపాదకీయం Editorial

# పీవోకే.. మన రాజకీయాల మౌనం

'మానవ హక్కులకు సరిహద్దులు ఉండవు' అని ప్రపంచ దేశాలు తరచూ చెబుతుంటాయి. ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, భావ ప్రకటనా హక్కు, మానవ గౌరవం వంటి విలువలు సార్వత్రికమైనవని కూడా నొక్కి చెబుతాయి. కానీ ఆచరణలో మాత్రం మానవ హక్కుల అంశాలు చాలాసార్లు రాజకీయ, దౌత్య ప్రయోజనాల కళ్లజోడుతోనే చూడబడుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో నివసించే ప్రజల పరిస్థితి, అక్కడి మానవ హక్కుల ఆరోపణలు, రాజకీయ హక్కుల పరిమితులపై దేశీయ రాజకీయాల్లో తగిన చర్చ ఎందుకు జరగడం లేదనే ప్రశ్న తలెత్తుతోంది. భారత్ అధికారిక వైఖరి ప్రకారం పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ భారతదేశంలో అంతర్భాగం. పార్లమెంట్ కూడా గతంలో దీనిపై తీర్మానం చేసింది. భారత ప్రభుత్వం పలు సందర్భాల్లో పీవోకే భారతదేశానికి చెందిన భూభాగమేనని స్పష్టం చేస్తూ వచ్చింది. అదే సమయంలో, పీవోకేలో ప్రజాస్వామ్య హక్కులు, అభివృద్ధి, పరిపాలన, స్థానిక ప్రజల పరిస్థితులపై కూడా వివిధ వేదికల్లో ప్రశ్నలు లేవనెత్తుతూ ఉంటుంది. పీవోకేకు సంబంధించిన అంశాల్లో తరచూ వినిపించే ఆరోపణల్లో భావ ప్రకటనా స్వేచ్ఛపై పరిమితులు, రాజకీయ కార్యకలాపాలపై ఆంక్షలు, నిరసనల అణచివేత, స్థానిక ప్రజల అసంతృప్తి, అభివృద్ధి అసమానతలు వంటి విషయాలు ఉంటాయి. ఈ అంశాలపై వివిధ విశ్లేషకులు, పరిశోధకులు, అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థలు కాలానుగుణంగా నివేదికలు విడుదల చేస్తుంటాయి. అయితే ఈ ఆరోపణలపై అభిప్రాయాలు భిన్నంగా ఉండవచ్చు. అందువల్ల ఇటువంటి అంశాలను విశ్వసనీయ ఆధారాలు, ధృవీకరించిన సమాచారంతోనే పరిశీలించడం అవసరం. అయితే దేశీయ రాజకీయాల్లో కనిపించే ఒక ఆసక్తికరమైన అంశం ఏమిటంటే.. ప్రపంచంలోని ఇతర దేశాల్లో జరిగే మానవ హక్కుల ఉల్లంఘనలపై ఘాటుగా స్పందించే అనేక రాజకీయ పార్టీలు, నాయకులు పీవోకే అంశంపై మాత్రం తరచూ మౌనం పాటిస్తున్నారనే విమర్శ. ఒక ప్రజాస్వామ్య దేశంగా భారత్‌కు ఉన్న నైతిక బాధ్యత ఏమిటంటే, మానవ హక్కుల అంశాలను రాజకీయ అనుకూలత లేదా ప్రతికూలత ఆధారంగా కాకుండా సార్వత్రిక విలువల కోణంలో చూడటం. ఎక్కడైనా ప్రజల హక్కులు ఉల్లంఘించబడుతున్నాయనే విశ్వసనీయ సమాచారం ఉంటే, దానిపై శాంతియుతంగా, బాధ్యతాయుతంగా స్పందించడం ప్రజాస్వామ్య విలువలకు అనుగుణంగా ఉంటుంది. ఇదే సమయంలో మరో విషయాన్ని కూడా గుర్తుంచుకోవాలి. మానవ హక్కుల అంశాలను రాజకీయ ప్రచారానికి మాత్రమే పరిమితం చేయకుండా, అంతర్జాతీయ చట్టాలు, దౌత్యపరమైన చర్చలు, విశ్వసనీయ ఆధారాలు, బాధితుల సంక్షేమం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. భావోద్వేగాల కంటే వాస్తవాలు, ప్రచారం కంటే ప్రజల సంక్షేమం ముఖ్యమనే దృక్పథం అవసరం. భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యంగా తన స్థానాన్ని బలోపేతం చేసుకుంటున్న తరుణంలో, మానవ హక్కులపై తన నిబద్ధతను అన్ని సందర్భాల్లో ఒకే ప్రమాణంతో ప్రదర్శించాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో, ఇలాంటి సున్నితమైన అంతర్జాతీయ అంశాలపై బాధ్యతాయుతమైన చర్చ, కచ్చితమైన సమాచారం, దౌత్యపరమైన సమతుల్యత కూడా అంతే అవసరం. మానవ హక్కులు రాజకీయాలకు అతీతమైన విలువలు. అవి ఎవరి పక్షానో, ఎవరి వ్యతిరేకంగానో ఉండవు; అవి మనిషి గౌరవానికి సంబంధించినవి. పీవోకే అయినా, ప్రపంచంలోని మరే ప్రాంతమైనా.. ప్రజల హక్కులు, స్వేచ్ఛ, గౌరవం గురించి చర్చ జరిగేటప్పుడు అది రాజకీయ మౌనానికి బలి కాకూడదు. ప్రజాస్వామ్యానికి నిజమైన బలం, అన్ని ప్రాంతాల ప్రజల మానవ హక్కుల పట్ల ఒకే స్థాయి నిబద్ధతను చూపడంలోనే ఉంది.

అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం సందర్భంగా..



# ట్రెండు మారినా.. ఫ్రెండు మారడు!

ప్రపంచం పరుగులు పెడుతోంది. కాలం క్షణాల్లో మారిపోతోంది. సాంకేతికత మనిషి ఊహించని అద్భుతాలను సృష్టిస్తోంది. ఒకప్పుడు నెలలు పట్టిన సమాచారం ఇప్పుడు క్షణాల్లో చేరుతోంది. వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న వారితో కళ్లల్లోకి చూసుకుంటూ మాట్లాడే అవకాశం మన చేతుల్లోకి వచ్చింది. ప్రపంచం నిజంగానే అరచేతిలో ఒదిగిపోయింది. అయితే ఈ అపూర్వమైన సాంకేతిక విప్లవం మధ్య ఒక మౌన ప్రశ్న మన మనసులను తట్టి లేపుతోంది. ప్రపంచానికి దగ్గరవుతున్న మనం... పక్కనే ఉన్న మనిషికి దూరమవుతున్నామా? ఈ ప్రశ్నకు సమాధానం వెతికితే మన ఆధునిక జీవనశైలి వెనుక దాగి ఉన్న ఒక విషాద వాస్తవం కనిపిస్తుంది. సాంకేతికత మన మధ్య దూరాలను తగ్గించింది. కానీ మన హృదయాల మధ్య దూరాలను మాత్రం పెంచింది. సమాచారాన్ని పంచుకోవడం నేర్పింది. కానీ మనసును పంచుకోవడం మాత్రం మరిపించింది. మనిషి జీవితంలో ఎన్నో బంధాలు పుట్టుకతో వస్తాయి.

తల్లిదండ్రులు, తోబుట్టువులు, బంధువులు... ఇవన్నీ ప్రకృతి ప్రసాదించిన వరాలు. కానీ స్నేహం మాత్రం మనిషి తన హృదయంతో ఎంచుకునే బంధం. రక్త సంబంధం లేకపోయినా, జీవితాంతం తోడుగా నిలిచే అనుబంధం. అందుకే స్నేహం ఒక భావోద్వేగం మాత్రమే కాదు... మనిషి మనుగడకు ప్రాణాధారం.

స్నేహం అంటే జీవితంలో కలిసిన మరో వ్యక్తి కాదు... మన జీవితంలో కలిసిపోయిన మరో మనసు. మన కన్నీళ్లు రాకముందే కళ్లలోని తడి చదివే వాడు స్నేహితుడు. ప్రపంచం మొత్తం మనల్ని అపార్థం చేసుకున్నా, ఒక్కసారి మన కళ్లలోకి చూసి "నువ్వు అలా చేయవని నాకు తెలుసు" అని నమ్మకంగా చెప్పే మనిషే నిజమైన స్నేహితుడు. విజయ శిఖరంపై నిలిచినప్పుడు చప్పట్లు కొట్టేవారు ఎందరో ఉంటారు; కానీ ఓటమి అగాధంలో పడిపోయినప్పుడు మన చేయి వదలకుండా గట్టిగా పట్టుకుని పైకి లాగే చేయి మాత్రమే స్నేహం. తల్లిదండ్రులు జన్మనిస్తారు... గురువులు జ్ఞానాన్ని అందిస్తారు... కానీ జీవితం భారంగా అనిపించిన ప్రతిసారీ మళ్లీ నవ్వడం నేర్పేది, ఆశ చనిపోయిందనుకున్న క్షణంలో మనసులో వెలుగు నింపేది, "నీకు నేనున్నాను" అనే ఒక్క మాటతో విరిగిపోయిన ఆత్మవిశ్వాసాన్ని మళ్లీ నిలబెట్టేది నిజమైన స్నేహమే. అందుకే స్నేహితుడు జీవితంలో ఒక పాత్ర కాదు... మన జీవిత కథలో దేవుడు రాసిన అత్యంత అందమైన అధ్యాయం. ఈరోజు సోషల్ మీడియా తెరిస్తే వేలాది మంది "ఫ్రెండ్స్", లక్షలాది "ఫాలోవర్లు", వందలాది "లైక్‌లు" కనిపిస్తాయి. కానీ జీవితంలో ఒక కష్టం ఎదురైనప్పుడు, "ఏమైంది?" అని మన కళ్లల్లోకి చూసి అడిగే నిజమైన మనిషి ఎంతమంది? ఒకప్పుడు మన బాధను పంచుకునే మనుషులు ఉండేవారు. ఇప్పుడు మన బాధను చూసి ఒక "సాడ్ ఎమోజీ" పంపించే పరిచయాలు మాత్రమే మిగిలాయి. నోటి మాటల స్థానంలో టైపింగ్ వచ్చింది. ఆప్యాయమైన కౌగిలింతల స్థానంలో వీడియో కాల్‌లు వచ్చాయి. చేతులు పట్టుకుని చెప్పే ధైర్యం స్థానంలో స్టిక్కర్లు వచ్చాయి. నవ్వులు కూడా డిజిటల్ అయ్యాయి. కానీ మనసుకు కావాల్సింది ఇంటర్నెట్ వేగం కాదు... ఇంకో మనసు.

ఒకప్పుడు ప్రతి గ్రామంలో ఒక అరుగు ఉండేది. ప్రతి వీధిలో ఒక రచ్చబండ ఉండేది. అక్కడ నవ్వులు పంచుకునేవారు. బాధలు పంచుకునేవారు. ఒకరి ఇంట్లో కష్టం వస్తే అది ఊరంతా భుజాన వేసుకునేది. ఒకరి ఆనందం అందరి పండుగ అయ్యేది. సాయంత్రం అయ్యిందంటే పిల్లలు మైదానాల్లో ఆడుకునేవారు. పెద్దలు అరుగులపై కూర్చుని కబుర్లు చెప్పుకునేవారు. జీవితాన్ని పంచుకునేవారు. ఇప్పుడు.. అరుగు స్థానంలో మొబైల్ స్క్రీన్ వచ్చింది. పలకరింపు స్థానంలో స్టేటస్ వచ్చింది. ఆప్యాయమైన చిరునవ్వు స్థానంలో ఎమోజీ వచ్చింది. స్నేహితుడి స్థానంలో ఫాలోవర్ వచ్చాడు. ఇది కేవలం జీవనశైలి మార్పు కాదు. మనిషిలోని మానవత్వం క్రమంగా కరిగిపోతోందనే హెచ్చరిక. నగరాలు విస్తరిస్తున్నాయి. భవంతులు ఆకాశాన్ని తాకుతున్నాయి. కానీ మనుషుల హృదయాలు మాత్రం రోజురోజుకూ చిన్నవవుతున్నాయి. వందల కుటుంబాలు నివసించే అపార్ట్‌మెంట్‌లో పక్కింటి వ్యక్తి పేరు కూడా తెలియని పరిస్థితి ఏర్పడింది. లిఫ్ట్‌లో ఎదురైనా చిరునవ్వు పంచుకునే సమయం లేదు. అత్యవసర సమయంలో తలుపు తట్టే ధైర్యం కూడా తగ్గిపోయింది. సీసీ కెమెరాలు దొంగలను కనిపెట్టగలవు. కానీ మనిషికి భరోసా ఇవ్వలేవు. ఇంటి తలుపులకు తాళాలు వేయొచ్చు. కానీ మనసులకు తాళాలు వేస్తే సమాజమే బందీ అవుతుంది. ఒక సమాజాన్ని భద్రంగా నిలబెట్టేది సిమెంట్ గోడలు కాదు... మనుషుల మధ్య ఉండే నమ్మకం, ఆత్మీయత.

స్నేహితుల దినోత్సవం అంటే సోషల్ మీడియాలో ఫొటోలు పెట్టడం, ఫ్రెండ్‌షిప్ బ్యాండ్ కట్టుకోవడం మాత్రమే కాదు. ఎన్నాళ్లుగానో మాట్లాడని స్నేహితుడికి ఒక ఫోన్ చేయడం. పక్కింటి వృద్ధుడిని పలకరించడం. ఒంటరిగా కనిపించే వ్యక్తి పక్కన కూర్చోవడం. పిల్లలకు గాడ్జెట్‌ల కంటే బంధాల విలువ నేర్పించడం. రోజులో కొంత సమయాన్ని స్క్రీన్‌ల కోసం కాదు... మనుషుల కోసం కేటాయించడం. కాలం మారుతుంది. సాంకేతికత మారుతుంది. తరాలు మారుతాయి. కానీ మనిషి మనిషికి తోడుగా నిలిచే హృదయం మాత్రం ఎన్నటికీ మారకూడదు. జీవితంలో సంపాదించే గొప్ప సంపద డబ్బు కాదు. పదవి కాదు. పేరు కాదు. ఆపదలో "నేనున్నాను" అని చేయి అందించే ఒక నిజమైన స్నేహితుడు. ఒక రోజు మన ఫోన్‌లోని వేలాది కాంటాక్టులు మౌనమైపోవచ్చు. సోషల్ మీడియా ఖాతాలు కనుమరుగైపోవచ్చు. లైక్‌లు, కామెంట్లు, ఫాలోవర్లు కాలగర్భంలో కలిసిపోవచ్చు. కానీ జీవితాంతం మన జ్ఞాపకాలలో నిలిచేది, చివరి క్షణంలో కూడా మన చేతిని గట్టిగా పట్టుకునేది ఒక్క నిజమైన స్నేహమే. అందుకే... ఫాలోవర్లను కాదు... స్నేహితులను సంపాదించండి. మొబైల్‌లను కాదు... మనుషులను హత్తుకోండి. లైక్‌లను కాదు... హృదయాలను గెలుచుకోండి. ఎందుకంటే... ఒక సమాజపు నాగరికతను కొలిచేది భవంతుల ఎత్తు కాదు... మనుషుల మధ్య ఉన్న అనుబంధాల లోతు. డిజిటల్ యుగంలోనూ కాలం చెరపలేని, కష్టాలు కూల్చలేని, మరణం కూడా మాయంచేయలేని శాశ్వత కావ్యం ఒక్కటే... "స్నేహం".



కాలగిరి శ్రీనివాస్ రెడ్డి
సీనియర్ జర్నలిస్ట్, సెల్: 9010128884

# సేవ పేరుతో శిక్షలు

ప్రజల పొదుపులను భద్రపరచడం, ఆర్థిక లావాదేవీలను సులభతరం చేయడం, దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలవడం బ్యాంకుల ప్రధాన బాధ్యత. కానీ ఇటీవలి కాలంలో మినిమం బ్యాలెన్స్ మెయింటెయిన్ చేయలేదనే పేరుతో విధిస్తున్న జరిమానాలు, వివిధ రకాల సేవా చార్జీలు, ఎస్ఎంఎస్ చార్జీలు, ఏటీఎం చార్జీలు, డెబిట్ కార్డు ఫీజులు, ఖాతా నిర్వహణ రుసుములు వంటి పేర్లతో ఖాతాదారులపై పెరుగుతున్న ఆర్థిక భారం తీవ్ర చర్చకు దారితీస్తోంది. ఒకప్పుడు బ్యాంకు అంటే ప్రజల విశ్వాసానికి ప్రతీక. తమ కష్టార్జిత సొమ్మును భద్రంగా ఉంచుకునే ప్రదేశం. కానీ ఇప్పుడు చాలా మంది ఖాతాదారులు "డబ్బు జమ చేస్తే వడ్డీ కంటే చార్జీలే ఎక్కువగా కట్ అవుతున్నాయి" అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పేదలు, రోజువారీ కూలీలు, చిన్న వ్యాపారులు, వృద్ధులు, విద్యార్థులు, నిరుద్యోగులు ఈ మినిమం బ్యాలెన్స్ నిబంధనల వల్ల ఎక్కువగా నష్టపోతున్నారు. బ్యాంకులు సాధారణంగా ఖాతాదారులు తమ సేవింగ్స్ ఖాతాలో ఒక నిర్దిష్ట కనీస నిల్వ ఉంచాలని నిబంధన విధిస్తాయి. నగరాలు, పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలను బట్టి ఈ మొత్తం మారుతూ ఉంటుంది. నిర్ణయించిన మొత్తానికి తక్కువగా నిల్వ ఉంటే జరిమానా విధిస్తారు. కొన్ని సందర్భాల్లో జరిమానాపై పన్నులు కూడా వసూలు చేస్తారు. ఫలితంగా ఖాతాలో ఉన్న చిన్న మొత్తమూ తగ్గిపోతుంది. చాలాసార్లు ఖాతాదారుడికి తెలియకుండానే వరుసగా చార్జీలు పడుతూ ఖాతా దాదాపు ఖాళీ అయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఇక్కడ ప్రధాన ప్రశ్న ఏమిటంటే... బ్యాంకులు ఎవరికి సేవ చేయాలి? ప్రజలకు? లేక లాభాలకే పరిమితం కావాలా? బ్యాంకులు వ్యాపార సంస్థలే అయినప్పటికీ, ముఖ్యంగా ప్రభుత్వ రంగ బ్యాంకులు సామాజిక బాధ్యతను కూడా నిర్వర్తించాలి. గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలను విస్తరించడం, ఆర్థిక సమ్మిళితాన్ని ప్రోత్సహించడం, పేదలను బ్యాంకింగ్ వ్యవస్థలోకి తీసుకురావడం ప్రభుత్వ లక్ష్యం. జనధన్ ఖాతాలు, డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్, పెన్షన్లు, విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, రైతు సబ్సిడీలు.. ఇవన్నీ బ్యాంకు ఖాతాల ద్వారానే అందుతున్నాయి. అలాంటి పరిస్థితుల్లో మినిమం బ్యాలెన్స్ పేరిట పేదల ఖాతాల్లోని డబ్బును కోత పెట్టడం ఆర్థిక సమ్మిళిత స్ఫూర్తికి విరుద్ధంగా కనిపిస్తోంది. ఒక గ్రామీణ కూలీ నెలకు రూ.2,000 లేదా రూ.3,000 మాత్రమే పొదుపు చేయగలిగితే, అతని ఖాతాలో కొంతకాలం తక్కువ మొత్తం ఉండటం సహజం. ఒక విద్యార్థి చదువు పూర్తయ్యే వరకు ఆదాయం లేకపోవచ్చు. ఉద్యోగం కోల్పోయిన వ్యక్తి ఖాతాలో కనీస నిల్వ ఉంచలేకపోవచ్చు. అలాంటి వారికి జరిమానా విధించడం సేవ కంటే శిక్షలా మారుతోంది. ఇటీవలి సంవత్సరాల్లో బ్యాంకుల లాభాలు గణనీయంగా పెరుగుతున్నాయి. డిజిటల్ బ్యాంకింగ్, యూపీఐ, ఇంటర్నెట్ బ్యాంకింగ్, మొబైల్ యాప్‌ల వల్ల కార్యకలాపాల ఖర్చు కూడా అనేక రంగాల్లో తగ్గింది. అయినప్పటికీ కొత్త కొత్త చార్జీలు పెరుగుతుండటం ఖాతాదారుల్లో అసంతృప్తిని పెంచుతోంది. ఖాతా నిర్వహణకు అయ్యే వాస్తవ ఖర్చుతో పోలిస్తే వసూలు చేసే రుసుములు సమంజసమేనా అనే ప్రశ్నకు బ్యాంకులు స్పష్టమైన సమాధానం ఇవ్వాల్సిన అవసరం ఉంది. డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం ఒకవైపు నగదు రహిత ఆర్థిక వ్యవస్థ వైపు అడుగులు వేస్తుంటే, మరోవైపు బ్యాంకు చార్జీలు ప్రజలను బ్యాంకింగ్ వ్యవస్థ నుంచి దూరం చేసే ప్రమాదం ఉంది. ఖాతాలో డబ్బు ఉంచితే చార్జీలు పడతాయనే భయంతో కొందరు మళ్లీ నగదు



లావాదేవీల వైపు మొగ్గు చూపే అవకాశం కూడా ఉంది. అయితే బ్యాంకుల వాదనను కూడా పూర్తిగా విస్మరించలేం. ఖాతాల నిర్వహణ, సాంకేతిక మౌలిక సదుపాయాలు, సైబర్ భద్రత, ఏటీఎం నెట్‌వర్క్, సిబ్బంది వ్యయం వంటి ఖర్చులు పెరుగుతున్నాయని బ్యాంకులు చెబుతున్నాయి. ప్రతి ఖాతాను నిర్వహించడానికి కొంత వ్యయం తప్పనిసరిగా ఉంటుందని, అందుకే కొన్ని సేవలకు రుసుములు అవసరమని వాదిస్తున్నాయి. ఈ వాదనలో కొంత వాస్తవం ఉన్నప్పటికీ, సేవా రుసుములు సహేతుకంగా, పారదర్శకంగా, సామాన్యుడికి భారం కాకుండా ఉండాలి. అందుకే ఇప్పుడు సమీక్ష అవసరం.

మొదటగా, ప్రాథమిక సేవింగ్స్ ఖాతాలకు ఎలాంటి మినిమం బ్యాలెన్స్ నిబంధన ఉండకూడదు. పేదలు, విద్యార్థులు, వృద్ధులు, దివ్యాంగులు, సామాజిక సంక్షేమ పథకాల లబ్ధిదారులకు పూర్తిస్థాయి మినహాయింపు ఇవ్వాలి. రెండవది, మినిమం బ్యాలెన్స్ జరిమానా విధించే ముందు ఖాతాదారులకు ముందస్తు హెచ్చరికలు పంపాలి. ఖాతాలో తగినంత మొత్తం జమ చేసుకునేందుకు సమయం ఇవ్వాలి. మూడవది, సేవా చార్జీలన్నింటినీ బ్యాంకులు స్పష్టంగా ప్రజలకు తెలియజేయాలి. చిన్న అక్షరాల్లో కాకుండా, సులభంగా అర్థమయ్యే భాషలో, మొబైల్ సందేశాల ద్వారా కూడా సమాచారం అందించాలి. నాలుగవది, బ్యాంకింగ్ నియంత్రణ సంస్థలు చార్జీలపై కాలానుగుణ సమీక్ష నిర్వహించాలి. బ్యాంకుల ఆర్థిక అవసరాలు, ఖాతాదారుల ప్రయోజనాల మధ్య సమతుల్యత ఉండేలా మార్గదర్శకాలు రూపొందించాలి. ఐదవది, బ్యాంకుల పనితీరును కేవలం లాభాల ఆధారంగా కాకుండా ఖాతాదారుల సంతృప్తి, సామాజిక బాధ్యత, సేవల నాణ్యత ఆధారంగా కూడా అంచనా వేయాలి. బ్యాంకులు ప్రజల డబ్బుతోనే నడుస్తాయి. ప్రజల నమ్మకమే వాటి అతిపెద్ద మూలధనం. ఆ నమ్మకాన్ని చార్జీల భారంతో దెబ్బతీయడం ఏ బ్యాంకుకూ మంచిది కాదు. ఆర్థిక వ్యవస్థలో బ్యాంకుల పాత్ర ఎంత కీలకమో, ప్రజల ప్రయోజనాలను కాపాడే బాధ్యత కూడా అంతే కీలకం. పొదుపు చేయాలని ప్రభుత్వం చెబుతోంది. బ్యాంకు ఖాతా తప్పనిసరి అంటోంది. అదే సమయంలో మినిమం బ్యాలెన్స్ పేరిట పేదల పొదుపులను కరిగించడం సామాజిక న్యాయానికి విరుద్ధం. సేవింగ్స్ ఖాతా అనేది ఆదాయం ఉన్నవారికే కాదు, పొదుపు చేయాలనే సంకల్పం ఉన్న ప్రతి పౌరుడికీ అందుబాటులో ఉండాలి. బ్యాంకులు లాభాలను ఆర్జించడం తప్పు కాదు; కానీ ఆ లాభాలు సామాన్యుడి బలహీనతపై ఆధారపడకూడదు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలంటే సేవకు ప్రాధాన్యం ఇవ్వాలి.. చార్జీలకు కాదు.



This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.